కరోనా.. మళ్లీనా!?

- భీతిల్లుతున్న జిల్లావాసులు
- ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు



నెల్లూరు (వైద్యం) మే 27 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్.. ఈ పేరు చెబితేనే జిల్లావాసుల్లో వణుకు పుడుతుంది. సరిగ్గా రెండేళ్ల క్రితం వరకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఆ మహమ్మారి మళ్లీ విస్తరిస్తోందని ప్రచార మాధ్యమాల ద్వారా తెలియడంతో ప్రజల్లో ఆందోళన రేగుతోంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీలో 1009 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక మనరాష్ట్రంలో విశాఖ, తణుకుల లో రెండు కేసులు నమోదైనట్టు సమా చారం. కరోనా వెలుగు చూసిన రాష్ట్రాలతో జిల్లావాసు లు వివిధ వ్యాపారాల రీత్యా వెళు తుండటంతో ఎక్కడ కరోనా బారి న పడాల్సి వస్తుందోనని భీతిల్లు తున్నారు. 2019, మార్చి 11వ తేదీన రాష్ట్రంలోనే నెల్లూరు లో తొలికేసు నమోదయింది. 2022, వరకు నాలుగు విడతలుగా 1.66 లక్షలకు పైగా కరోనా కేసులు జిల్లాలో నమోదు అయ్యాయి. 336 మంది జిల్లాలో మృత్యువాత పడ్డారు. ఇప్పుడు మళ్లీ కరోనా విస్తరిస్తోందని తెలియడంతో ప్రజ ల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రస్తుతం నమోదవుతున్న ఎన్‌బీ 1.8.1, ఎల్ఎఫ్ వేరియెంట్‌పై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ సార్స్ కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం స్పష్టం చేస్తోంది. మరోవైపు కేసుల ఉధృతి నేపథ్యంలో త్వరలోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పలు ఆదేశాలు అందే అవకాశం ఉంది.

ఎలాంటి ఆదేశాలు అందలేదు



ఇప్పటివరకు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే జిల్లాలో కరోనా కేసులు ఎక్కడ నమోద యినా రాష్ట్ర అధికా రుల సూచనల మేరకు వెంటనే వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇప్పటి కరోనా వేరియెం ట్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదు.

\- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగం

జిల్లాలో కరోనా కేసులు నమోద యితే వారికి వెంటనే వైద్యసేవలు అందించేందుకు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తక్షణం 30 పడకలతో ప్రత్యేక విభాగం ఏర్పాటుకు అధికా రులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో 20 పడ కలు సాధారణ కేసులకు కేటాయిస్తున్నారు. అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచారు. శ్వాసకోశ వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉండనున్నారు.

జీజీహెచ్‌లో 30 పడకల ఏర్పాటు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కరోనా బాధితులకు వెంటనే వైద్య చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇందు కోసం శ్వాసకోశ విభాగంలో 30 ప్రత్యేక పడకలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో 10 పడకలు ఐసీయూకే కేటాయించాము. వ్యాధిగ్రస్థులకు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. అవసరమైన ఆక్సిజన్ కూడా తగినంత అందుబాటులో ఉంది.

\- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్



కోవూరు : కడపలో టీడీపీ శ్రేణులతో కలిసి మహానాడు ప్రాంగణానికి వెళుతున్న వేమిరెడ్డి దంపతులు

మహా ఉత్సాహం

టీడీపీలో మహానాడు జోష్ ● కడపకు తరలిన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

మహానాడు.. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. రాష్ట్రంలో అధి కారం చేపట్టి సరిగ్గా సంవత్సరం సమీపిస్తుండటం.. ఈ తరుణంలోనే కడపలో మహానాడు జరుగుతుండటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెల కొంది. మంగళవారం ప్రారంభమైన ఈ మహా వేడుకలో పాల్గొనేందుకు ఉదయా న్నే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ ప్రతినిధులూ తమ అనుచ రగణంతో తరలివెళ్లారు. గురువారం జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు వాహన సమీకరణ చేసుకుంటున్నారు.

● **కోవూరు :** కడపలో జరుగుతున్న మహానాడులో మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రదర్శనగా నడిచి హుషారెత్తించారు. కడపలోని విడిది కేంద్రం నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ పబ్బాపురంలోని మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. అంతక ముందు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో విడిది కేంద్రం కోలాహ లంగా మారింది. టీడీపీ నాయకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీని వాసులురెడ్డి, చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి బాధ్యతలు తీసుకుని సభల విజయ వంతానికి కృషి చేస్తున్నారు.



వింజమూరు : కార్యకర్తలతో మహానాడుకు వెళుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● **వింజమూరు :** మహానాడుకు ఉదయగిరి నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు వివిధ వాహనాల్లో కడపకు తరలివె ళ్లారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ జెండా ఊపి వాహనాలను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, వని పెంట సుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల కన్వీనర్లు, ముఖ్య నేతలు, తదితరులు పాల్గొ న్నారు.



మహానాడు ప్రాంగణంలో అల్లూరు నేతలు



కడపలో వెంకటాచలం నాయకులు

● **కావలి :** మహానాడుకు మంగళవారం ఉదయాన్నే కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసి వెళ్లారు. మహా నాడుకు ప్రాంగణంలో సీఎం చంద్ర బాబుతో మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి ఆయన్ను అభినందించారు.



మహానాడులో టీడీపీ నేతలతో కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



అశ్వ వాహనంపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మంగళవారం రాత్రి శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారు అశ్వవాహ నంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ధ్వజపీఠాల వద్ద ధ్వజావరోహణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు కొడిముద్దలను సంతానం కోరి వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఆలయం నుంచి అలిగివెళ్ళిన అమ్మవారిని స్వామివారు పెద్దలతో వెళ్ళి నచ్చజెప్పి తిరిగి ఆలయానికి తీసుకువచ్చిన అలకలతోపు సంప్రదాయ కార్యక్రమం ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి అశ్వవాహనసేవ అనంతరం ఆలయంలోని శయన మందిరంలో ప్రత్యేక పుష్పాలంకరణతో ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి, లాలిపాటలు ఆలపించారు.

నేడు 'సామూహిక యోగాంధ్ర'

నెల్లూరు(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పర్యాటక ప్రదేశమైన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, స్వర్ణాల చెరువ ఒడ్డున బుధవారం సామూహిక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్ర మంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పురపాలక, పర్యాటక, పట్టణ పేదరిక నిర్మూలన తదితర శాఖల అధికారులు అన్నీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యోగాలో ఉత్సాహం చూపే వారందరు క్యూఆర్‌కోడ్ ద్వారా రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలని సూచించారు.

నేడు రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర పండుగగా బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతీ ఏటా ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండువగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు. బుధవారం ఉదయం 10గంటలకు నర్తకి సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించడంతో పాటు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, జిల్లా అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు

- హైవే దాటుతున్న వారిని ఢీకొన్న లారీ
- తల్లీ కూతుళ్ల దుర్మరణం, మరో ఇద్దరికి గాయాలు
- గుడ్లూరు మండలం మోచర్ల వద్ద ఘోరం

గుడ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : బంధువులతో కలిసి తమ ఇష్టదైవమైన పోలేర మ్మను దర్శించుకున్నారు. ఎంతో ఆనందంతో తిరిగి ఇంటికి వెళుతున్న వారిని ఓ లారీ మృత్యువులా దూసుకొచ్చింది. వేగం గా వచ్చి ఢీకొనడంతో తల్లీకూతుళ్లు అక్కడి కక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయా లు అయ్యాయి. గుడ్లూరు మండలం మోచర్ల వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆ గ్రామస్థుల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది.





మృతులు మమత, రమాదేవి

గుడ్లూరు మండలం మోచర్ల బీసీ కాల నీకి చెందిన గద్దేటి రమాదేవి (46), ఈమె కుమార్తె దాసరి మమత (30) బంధువు లతో కలిసి మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని జాతీయ రహదారికి అవతల వైపు ఉన్న పోలేరమ్మను దర్శించుకున్నారు. తిరిగి 11 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో కావలి నుంచి ఒంగోలు వైపు వెళుతున్న (ఏపీ39 యూఎఫ్8499) 16 చక్రాల లారీ వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. లారీ చక్రాల కింద రమాదేవి, మమత పడి మాంసపు ముద్దలా మారిపో యారు. అలాగే, మృతుల బంధువులైన వెంకటరమణమ్మ, వైష్ణవిలకు కూడా గాయాలు కావడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. తల్లీ కూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియావై ద్యశాలకు తరలించారు. కాగా, మృతుల్లో దాసరి మమతకు భర్త, ఇద్దరు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘోర ప్రమాదంతో మోచర్ల గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యానాదుల కోసం ప్రత్యేక సహకార సంఘం

- రాష్ట్రంలోనే మొదటగా రాపూరులో ఏర్పాటు
- వెయ్యి మందికి సభ్యత్వం
- జిల్లా సహకార అధికారి గురప్ప



గిరిజన సహకార సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డీసీవో గురప్ప

నెల్లూరు (హరనాథపురం), మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాపూ రులో యానాదుల కోసం రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సహకార సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప చెప్పారు. మంగళవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో రాపూరు కు చెందిన యానాది వర్గ సభ్యులకు సహకార సంఘం రిజిస్ట్రేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాచీన గిరిజన తెగకు చెందిన యానాది కుటుంబాలను సమీకృతం చేసి, వారి జీవనోపాధులను మెరుగుపరచడానికి రాపూరులో షెడ్యూల్ తెగల వన్ ధన్ వికాస్ కేంద్ర పరస్పర సహాయక సహకార సంఘం రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. రాపూరు మండల పరిధిలోని వెలిగొండ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు వెయ్యి మంది యానాదులను సంఘంలో సభ్యులుగా చేర్పిస్తామన్నారు. వారికి వెలిగొండ అటవీ ప్రాంతంలోనే కలపేతర అటవీ ఫల సాయం, ముడి సరుకుల ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి మార్కెటింగ్ సౌకర్యం, ఆర్థిక సాధికారత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాపూరు సబ్ డివిజన్ సహకార శాఖ అధికారి వీ రవికుమార్, డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



సంచార వైద్యం.. పశువులకు దూరం

సంచార వైద్యం పశువులకు అందనంటోంది. రైతుల చెంతకే పశువైద్యం పేరుతో గత ప్రభు త్వం ఆర్భాటంగా ఈ వాహనాలను తీసుకురాగా, ఏడాదికాలంగా వీటి సేవలు ఆగిపోయాయి. మర్రిపాడు, అనంతసాగరం మండలాల కోసం ఓ సంచార వాహనాన్ని (అంబులెన్స్) అందుబాటులోకి తెచ్చారు. అయితే, ఏడాది కాలంగా ఎప్పుడు ఎక్కడ ఉంటుందో? ఎప్పుడు మరమ్మతులకు గురై షెడ్డుకు చేరుతుందో అంతుపట్టడం లేదు. గడిచిన నెల రోజుల వ్యవధిలో నాలుగు సార్లు మరమ్మతుకు గురైనట్లు సమాచారం. తాజాగా మరోమారు మరమ్మతుకు గురైన వాహనాన్ని మరో వాహన సాయంతో తీసుకుళుతున్న దృశ్యం ఇది

\- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)



కూలీలను విచారిస్తున్న పోలీసులు

'అగ్రిగోల్డ్' భూముల్లో మళ్లీ పుష్పాలు!

- జామాయిల్ చెట్లపై గొడ్డళ్ల వేటు
- లారీల్లో కలపను తరలించే యత్నం
- సీఐడీ, పోలీసులకు గ్రామస్థుల సమాచారం
- ఆరు వాహనాలతోపాటు 48 మంది కూలీలు అదుపులోకి..

ఉదయగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ భూముల్లో దొంగలు పడ్డారు. వారి గొడ్డళ్ల వేటుకు ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు నేలకొరుగు తున్నాయి. అధికారమే అండగా మొన్న వరికుంటపాడు, కలిగిరి మండలాల్లో యథేచ్ఛగా జామాయిల్, ఎర్రచందనం, శ్రీగంధం చెట్లు నరికి సొమ్ము చేసుకు న్నారు. తాజాగా మంగళవారం ఉదయ గిరి మండలం తిరుమలాపురం పంచా యతీలో అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లపై పడ్డారు. తిరుమలా పురం పంచాయతీలో అగ్రిగోల్డ్ సంస్థకు సుమారు 70 ఎకరాల భూములు ఉండ గా, సుమారు ఒకటిన్నర దశాబ్దం క్రితం సంస్థ జామాయిల్ సాగు చేపట్టింది. ప్రస్తుతం ఆ చెట్లు బాగా ఊరడం, ధర ఆశాజనకంగా ఉండటంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. ఇంకేముంది. మంగళ వారం తెల్లవారుజామునే 48 మంది కూలీలు, మూడు లారీలతో తోటల్లోకి చేరుకు న్నారు. గంటల వ్యవధిలోనే ఐదెకరాల్లో జామాయిల్ నరికి లారీలకు లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇది గుర్తించిన గ్రామస్థులు, అగ్రిగోల్డ్ సిబ్బంది వెంటనే పోలీసు, సీఐడీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఉదయగిరి ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కూలీలను విచారించారు. మూడు లారీలు, మూడు ఆటోలను స్వాధీనం తీసుకున్నారు. అలాగే 48 మంది కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ వ్యవహారం వెనుక ఉన్న పుష్పా ఎవరో తెలియాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా అక్రమ జామాయిల్ నరికివేత వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులెవరో అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



కర్రతో రవాణాకు సిద్ధంగా ఉన్న లారీ

కాలువ స్థలం రక్షణకు చర్యలు

● హెచ్చరిక బోర్డులు పెట్టిన అధికారులు

నెల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రామిరెడ్డి కాలువ భూముల రక్షణకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'కాలువ భూముల కబ్జా' కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా స్పందించి కాలువ స్థలాల కబ్జాను అడ్డుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు ఆక్రమణకు గురైన రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డులు పాతారు. ఈ స్థలంలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. అలానే ఆ కాలువ స్థలాన్ని ఆక్రమిం చిన వ్యక్తుల వివరాలు కూడా సేకరించారు. ఆక్రమణ దారులకు నోటీసులు పంపుతా మని ఇరిగేషన్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన ఇరిగేషన్ అధికారులు

కావలి ఆర్టీసీకి ఇంధన అవార్డు

కావలి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో అరుదైన అవార్డు దక్కిం చుకుంది. ఒక లీటరు డీజిల్‌కు 5.98 కి.మీ మైలేజ్ సాధించి నందుకు ఆర్టీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇంధన సామర్థ్య అవార్డును అందజేశారు. ఈ మేరకు మంగళ వారం డిపోలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి మురళీ బాబు పాల్గొని డిపో మేనేజరు శ్రీనివాసులుకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను కావలి డిపోకు నిర్దేశించిన ఇంధన పొదుపు లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కావలి డిపో జిల్లాలోని మిగతా డిపో లకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజరు కల్పన, కేఎంపీఎల్ మెకానిక్ పాండు రంగా రావు, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కావలి డీఎం శ్రీనివాసులుకు అవార్డు ఇస్తున్న జిల్లా ప్రజారవాణాధి కారి మురళీబాబు

జొన్నవాడలో హుండీల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో మంగళవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించారు. రూ.15,77, 517 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మే 8 నుంచి 27వ తేదీ వరకు ప్రధాన హుండీల ద్వారా రూ.13,82,435, మార్చి 26 నుంచి ఈ నెల 27వరకు అన్నదానం హుండీ ద్వారా రూ.1,95,082 భక్తులు సమర్పించుకున్నారు. 112 గ్రాముల బంగారం, 24 గ్రాముల వెండి, యూఏఈ దిరామ్స్ 10 లభించాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ టి. అశోక్‌కుమార్‌రెడ్డి, పర్యవేక్షణాధికారి శ్రీధర్‌నాయుడు, ఏపీజీ బ్యాంకు, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 99,900
వెండి ఒక గ్రాము	రూ. 102.90

సర్వేపల్లిలో యోగాపై అవగాహన

వెంకటాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగం గుంట ఎస్టీ కాలనీలో మంగళవారం వీఎస్ యూ ఎన్ఎస్ఎస్ యూనిట్ - 4 ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా యోగాపై అవగాహన కల్పించారు. ప్రముఖ యోగా నిపుణుడు ఆనంద్‌రెడ్డి విచ్చేసి వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి, యోగా యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రజలు కూడా చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్, రైజ్ సంస్థ వ్యవస్థాపకుడు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

● **పొదలకూరులో యోగాంధ్ర**

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : 'ప్రతిరోజూ యోగా చేద్దాం.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ని నిర్మిద్దాం' అని ఎంపీడీవో నరసింహారావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఈ ర్యాలీ నుంచి గేట్ సెంటర్ కూడలి వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

● **యోగాంధ్రపై గ్రామాల్లో అవగాహన**

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల్లో యోగాంధ్రపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. మంగళవారం బండేపల్లి, పిడూరు, కాగితాలపూరు గ్రామాల్లో యోగాంధ్రపై అవగాహన నిర్వహించారు. అనంతరం సూర్యనమస్కారాలు, ఆసనాలు, పిల్లలకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 29న మనుబోలు, మడమనూరు గ్రామాల్లో యోగాసనాలు, సూర్యనమస్కారాలు నిర్వహించి, యోగా ఆవశ్యకత గురించి తెలియ జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, కార్యదర్శులు అంకయ్య, చెంచమ్మ, గిరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాచలం : యోగాసనాలు ప్రదర్శిస్తున్న యోగా నిపుణుడు ఆనంద్‌రెడ్డి

ఉద్యోగులకు యోగాపై శిక్షణ

రాపూరు, (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ఉద్యోగులకు మంగళ వారం నాడు యోగాపై శిక్షణ ఇచ్చారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నెలపాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా మండల పరిషత్ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు స్థానికంగా ఉండే అయిదు సచివాలయాల్లో యోగాపై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో ఎంపీడీవో మారెళ్ల భవానీ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు


రాపూరు సచివాలయం వద్ద యోగాసనాలు అభ్యాసం చేస్తున్న ఉద్యోగులు



కరోనా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

● డాక్టర్ అహ్మద్‌బాబు, జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి

బుచ్చిరెడ్డిపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి) : ప్రజలు కరోనా పట్ల జాగ్రత్తలు పాటిస్తే దాని తీవ్రత నుంచి తప్పించుకోవచ్చు. గత వారం రోజులుగా జనాల్లో కరోనా వ్యాపిస్తుందన్న ఆందోళన ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు.

? ప్రజల్లో కరోనా కలకలం రేకెత్తిస్తోంది. మన ప్రాంతంలో అలాంటి అనుమానిత కేసులు ఎక్కడైనా నమోదయ్యాయా

! మన ప్రాంతంలో ఇప్పటి వరకు కరోనా అనుమానిత కేసులు నమోదు కాలేదు. కానీ రాష్ట్రంలో ఒకటీ రెండు కేసులు నమోదైనట్టు తెలుస్తోంది.

? జొన్నవాడ పీహెచ్‌సీలో కరోనా పరీక్షలు చేసే కిట్లు అందుబాటులో ఉన్నాయా

! జొన్నవాడ పీహెచ్‌సీలో కరోనా కిట్లు అందుబాటులో ఉన్నాయి. కరానా పాజిటీవ్ వస్తే పీహెచ్‌సీలో బెడ్లు కూడా ఉన్నాయి. ఇక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం నెల్లూరు జీజీహెచ్‌కి తరలిస్తాం. అక్కడ కూడా ఐసోలేషన్ వార్డు సిద్ధం చేసి ఉంది.

? గతంలో మాదిరిగా ఈసారి కరోనా విజృంభించే అవకాలుంటాయా

! గతంలో వచ్చిన కరోనా అంత తీవ్రస్థాయిలో ప్రస్తుతం ఉండదు. కరోనా తరువాత కూడా కరోనా సంబంధిత లక్షణాలతో పలు రకాల వ్యాధులు వచ్చాయి. కానీ ప్రమాద పరిస్థితి లేదు.

? జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తదితర వ్యాధులతో వచ్చే వారికి కరోనాపై అప్రమత్తం చేస్తూ సూచనలిస్తున్నారా.

! ప్రస్తుత వాతావరణం మార్పు వల్ల జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్ల నొప్పులు తదితర వ్యాధులతో వైద్య సేవలు కోసం వచ్చే వారిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి ఒక్కరు వేడి నీరు తాగడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, జ్వరం సోకిన వెంటనే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో, పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహించుకునేలా సూచనలిస్తున్నాం.

తెలుగు భాషను కనుమరుగు చేసే నిర్ణయం బాధాకరం

బుచ్చిరెడ్డిపాళెం, మే 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగు భాషను కనుమరుగు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బాధాకరమని తెలుగు పండితుల సంఘం నాయకుడు మునీంద్ర అన్నారు. ఈ మేరకు తెలుగు పండితుల సంఘం అధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాషతో విద్యాబోధన జరగకపోతే విద్యార్థులు భాషా సామర్థ్యాన్ని కోల్పోతారన్నారు. ఇతర రాష్ట్రాలలో మాతృభాషను బోధిస్తుంటే తెలుగు రాష్ట్రంలో దానికి భిన్నంగా జరగడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని తెలుగు భాష కనుమరుగు కాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు.

మహానాడుకు భారీగా టీడీపీ నేతలు

వెంకటాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు మంగళవారం సర్వేపల్లి నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కడపకు వెళ్లిన వారిలో తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, మావిళ్లపల్లి శ్రీనివాసులునా యుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, కనుపూరు సాగు నీటి సంఘం అధ్యక్షుడు వల్లూరు రమేష్ నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు కటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, రావూరి పద్మనాభనాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, ఉప్పలపాటి ధనుం జయనాయుడు, నంద కిషోర్‌రెడ్డి, శ్రీనితరెడ్డి, ఏలూరు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు మండలం నుంచి పలువురు తెలుగు తమ్ముళ్లు మంగళవారం తరలివెళ్లారు. మనుబోలులో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుయువత ప్రధానకార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. మహానాడుకు వెళుతూ విజయసంకేతం చూపుతూ నినాదాలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారుగా 100మంది నాయకులు, కార్యకర్తలు కార్లలో, బస్సుల్లో తరలివెళ్లారు.


తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు తోటపల్లిగూడూరు మండలం నుంచి అధిక సంఖ్యలో గ్రామ, మండల, జిల్లా స్థాయి టీడీపీ నేతలు తరలివెళ్లారు.

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు విడవలూరు, ముదివర్తి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్.కె. రఫీ, చలంచర్ల కామేశ్వరమ్మ, కందికట్టు భవానీ, ఇతర కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. అక్కడ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిశారు.

● కొడవలూరు : మండలంలోని కమ్మపాలెం, తలమంచి, రాజుపాలెం, రామన్నపాలెం, యల్లాయపాలెం తదితర గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు మంగళవారం మహానాడుకు తరలివెళ్లారు. వారిలో నాపా వెంకటేశ్వర్లునా యుడు, జొన్న శివకుమార్, మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కేతు వెంకట రమణారెడ్డి, గరిక పాటి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం నుంచి ప్రారంభమైన మహానాడుకు బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని టీడీపీ నాయకులు 50 మందికిపైగా తరలివెళ్లారు. వీరిలో హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, మోర్ల మురళి, దొడ్ల కోదండరామిరెడ్డి, వింజం రామానాయుడు, హరనాథ్, తదితరులు వెళ్లారు.


మనుబోలు : మహానాడుకు వెళుతున్న టీడీపీ నాయకులు



ముత్తుకూరు : రావి ఆకుపై ఎన్టీఆర్ సూక్ష్మ చిత్రం

తెలుగుభాషకు వెలుగు నింపిన ఎన్టీఆర్

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషకు వెలుగు నింపిన వ్యక్తిగా ఎన్టీ రామారావు చిరస్మరణీయుడని ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమ పద్మారత్నం తెలిపారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా ఎన్టీఆర్ సూక్ష్మ చిత్రాన్ని రావి ఆకుపై రూపొందించి నివాళులర్పించారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యతని ఆయన అన్నారు.

● **రావి ఆకుపై ఎన్టీఆర్**



పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : విశ్వవిఖ్యాత నట సార్వ భౌమ ఎన్టీ ఆర్ జయంతిని పురస్కరిం చుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన పచ్చా పెంచలయ్య ఎన్టీఆర్ చిత్రాన్ని రావిఆకుపై అద్భుతంగా గీశారు. రావి ఆకుపై గీసిన సూక్ష్మ కళా చిత్రం దానవీరశూర కర్ణ పాత్రలో ఎన్టీఆర్‌గా ఆయన చెప్పుకొచ్చారు.

రీ సర్వేను పరిశీలించిన ఆర్డీవో అనూష


సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో అనూష

ఇందుకూరుపేట, మే 27(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గంగపట్నంలో జరుగుతున్న భూముల రీ సర్వేను ఆర్డీవో ఎస్ఎస్ అనూష మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీ సర్వేలో సరైన పత్రాలను చూపించి రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఏదైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, మండల సర్వేయర్ హరనాథ్, గ్రామ సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత యాత్ర



సమైక్యత యాత్రలో సీపీఎం నాయకులు

ముత్తుకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఈపూరులో సమైక్యత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఉగ్ర దాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత అభినందనీయమన్నారు. వక్రబుద్ధితో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే శక్తులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్.మస్తాన్‌షా, ఉమమ్మ, మస్తానమ్మ, పోలమ్మ, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయుడి గ్రామోత్సవం



పొదలకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి అనంతరం 13 వారాల ఉత్సవాల్లో భాగంగా మొదటి వారమైన మంగళవారం పట్టణంలోని వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. రాత్రి జరిగిన స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. కోలాటాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం పోరాటం


గోడ పత్రిక విడుదల చేస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు షాన్వాజ్

ముత్తుకూరు, మే 27 (ఆంధ్ర జ్యోతి) : పేదల సంక్షేమం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్వాజ్ తెలిపారు. మంగళవారం ముత్తుకూరులోని పార్టీ కార్యాలయంలో ధర్నా గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 2న అన్నీ మండల కేంద్రాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో పేదలకు గత వైసీపీలో ఇచ్చిన 9 అంకణాల బదులుగా తాము 18 అంకణాలు ఇళ్ల స్థలం ఇస్తామని, ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు మంజూరు చేస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఈ హామీని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. అలాగే వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. హామీ మేరకు నిరుపేదలందరికీ సచివాలయం ద్వారా రాజకీయాలకు అతీతంగా రేషన్‌కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో కోతుల బెడద

● నానా బీభత్సం సృష్టిస్తున్న వానర సమూహం

● పట్టించుకోని అధికారులు

వెంకటాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని కసుమూరు, వెంకటాచలం గ్రామాల్లో కోతుల బెడద రోజు రోజుకి తీవ్ర మవుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని మిద్దెలు, చెట్లపై కోతులు పెద్ద సంఖ్యలో ఉంటున్నాయి. నిత్యం జనాల మధ్య నుంచే అవి పరుగులు తీస్తున్నాయి. దీంతోపాటు ఇళ్లల్లోకి దూరి తిను బండారాలు, పండ్లు, కూరగాయలను ఎత్తుకెళ్లడంతో పాటు విలువైన సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. కోతుల కారణంగా ప్రజలు పలు విధాలుగా నష్టపోతున్నారు. అలాగే మిద్దెలు, స్తంభాల పైకెక్కి డిష్, టెలిఫోన్, విద్యుత్ వైర్లు తెంచివేస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి దూరిన సమ యంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కోతులను తరిమే ప్రయ త్నం చేసే వారిపై దాడికి పాల్పడుతు న్నాయి. కోతుల గుంపు పగలంతా నానా బీభ త్సం సృష్టిస్తుం డటంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బం దులు పడుతు న్నారు. అయినా అధికా రులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. బయట ప్రాంతాల నుంచి ఎవరో గుర్తుతెలి యని వ్యక్తులు ఈ కోతులను ఈ ప్రాంతాలలో వదిలి వెళ్తున్నారన్న విమర్శలు వ్యక్త మవుతు న్నాయి. అధికారులు సత్వరమే స్పందించి కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



చంపుతామని బెదిరించిన ముగ్గురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని కత్తితో చంపుతామని బెదిరించి, దాడి చేసి నగదు దోచుకెళ్లిన ముగ్గురు నిందితులను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఆ స్టేషన్‌లో సీఐ దశరథ రామారావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరులోని సంతపేటకు చెందిన ఉడత నీరద్‌శ్యాం అనే వ్యక్తి ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున రోడ్డుమీద ఉండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. అతను ఇవ్వనని చెప్పడంతో నిందితులు ఇటుక రాయి, బీరు బాటిల్, నెయిల్ కట్టర్‌తో బెదిరించి దాడి చేసి రూ.1500 నగదు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో సీఐ దశరథ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. సాంకేతికత ఆధారంగా ముగ్గురు నిందితులు పాత నేరస్తులైన షేక్ నవాజ్, షేక్ అబ్దుల్ సుబహాన్ అలియాస్ చోటు, షేక్ అబ్దుల్ సమద్‌గా గుర్తించారు. వారిపై వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నాయి, పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చారు. ఆ ముగ్గురు నిందితులను మంగళవారం రంగనాయకులపేట రైల్వే గేటు సమీపంలో అరెస్ట్ చేశారు. నెయిల్ కట్టర్, రూ.450 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడిచేసిన ముగ్గురు నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కోటమిట్టకు చెందిన షేక్ ఇంతియాజ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఈ నెల 25న తన బాబాయి నిస్సార్ ఇంటికి బైక్‌పై వెళుతుండగా వాహనం అదుపుతప్పి మరో బైక్‌పై పడ్డాడు. దీంతో అక్కడున్న మైజుల్లాఖాన్, అతని అల్లుడు, దుకాణంలో పని చేస్తున్న మరో వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంతియాజ్‌పై దాడి చేశారు. గాయపడ్డ బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స అనంతరం మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ షేక్ అబ్దుల్ రజాక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో డీజే ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... కోవూరుకు చెందిన పీ బాబూరావు(30), కపాడి పాళేనికి చెందిన భవానీ పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. బాబూరావు డీజేగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ కపాడిపాళెంలోనే నివసిస్తున్నారు. కొంత కాలంగా భార్య, భర్తలు మనస్పర్థలతో తరచూ గొడవపడుతున్నారు. ఈ క్రమంలో నెల కిందట బాబూరావు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోయాడు. భార్య, భర్తల గొడవల నేపథ్యంలో మనస్థాపానికి గురైన ఆయన 20 రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు చికిత్స చేయించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈనెల 25వ తేదీన పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని అజంతా లాడ్జీలో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం రాత్రి లాడ్జి గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం లాడ్జి సిబ్బంది గమనించి యాజ మాన్యానికి తెలిపారు. సమాచారం అందుకున్న సంతపేట ఎస్ఐ జీ బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బాబూరావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ఇద్దరి అదృశ్యం

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు వేదాయపాళెం స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని సుందరయ్య కాలనీ బీబ్లాక్‌లో కే శ్రీనివాసులు కుటుంబం నివసిస్తోంది. ఆయన కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 29వ తేదీ కూలిపనికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు మణి సోమవారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బుజబుజ నెల్లూరులో మహేంద్ర, సాయికుమారి దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయికుమారి పడారుపల్లిలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తానని అత్త అరుణకు చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో మహేంద్ర తన అత్తింటివారికి ఫోన్ చేశాడు. అక్కడకు రాలేదని వారు చెప్పడంతో ఆమె కోసం చుట్టుపక్కల గాలించారు. జాడ తెలియకపోవంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన చిన్నయ్య

మనుబోలు, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనుబోలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధు డికి తీవ్ర గాయాలయ్యాయి. కోదండ రామపురం దళితవాడకు చెందిన కొం డేటి చిన్నయ్య అనే వృద్ధుడు కూలి చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేం దుకు రోడ్డు దాటుతుండగా, నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళుతున్న మోటార్‌సైకిల్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో చిన్నయ్య కుడికాలు విరిగింది. తలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

కావలి రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మంగళవారం మృతి చెందింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం రామచంద్రాపుంకు చెందిన కోసూరు తిరుపతమ్మ(55) ఈనెల 24వ తేదీన గ్రామంలోని దుకాణానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన కొమ్మన శివకుమార్ మోటారు బైక్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి తిరుపతమ్మను ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు అక్కడ నుంచి చెన్నైకు తరలించారు. తిరిగి ఈనెల 26వ తేదీన చెన్నై నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో తల్లిదండ్రులపై దాడి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తల్లిదండ్రులపై తనయుడు దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి కావలి పట్టణం ముసునూరు అరుంధతీయవాడలో జరిగింది. బాధితుల వివరాల మేరకు... పోతిపోగు ఈసాకు, కొండమ్మ వృద్ధ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కొండయ్య. బేల్దారి పనులకు వెళ్లేవాడు. సంపాదించిన డబ్బులు భార్య శాంతమ్మకు ఇవ్వకుండా మద్యం తాగి వచ్చేవాడు. ఈ క్రమంలో భార్య శాంతమ్మతో గొడవపడి కొడుతుండగా పక్కనే మరో ఇంట్లో వేరుగా నివశించే తల్లిదండ్రులు ఈసాకు, కొండమ్మలు అడ్డుపడ్డారు. దీంతో వారిపై దాడి చేయడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని బంధువులు ఏరియా వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510



ట్రంప్ వ్యాఖ్యలు సరికాదు : సీపీఎం

నెల్లూరు సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి) : భారత్ దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను సీపీఎం నాయకులు ఖండించారు. మంగళ వారం ఆ పార్టీ నాయకులు సమైక్యత యాత్రలను మండలంలోని పొట్టేపా ళెంలో మొదలుపెట్టారు. నాయకులు తిరుపాలు, జనార్దన్ మాట్లాడుతూ భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలను ప్రతీ ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా చేపడుతున్న తిరంగా ర్యాలీలుపై అభ్యంతరం తెలిపారు. అనంతరం దేవరపాళెం, ములుముడి, సౌత్‌మోపూరు గ్రామాల్లోనూ సమైక్యత యత్ర నిర్వహించారు.

నాకు తెలియకుండా పనులు చేస్తారా?

- ఇరిగేషన్ అధికారుల తీరుపై మంత్రి నారాయణ ఆగ్రహం
- పెన్నా రక్షణ గోడ పనులు ఆపాలని ఆదేశం

నెల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో పెన్నా రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు మొదలు అనేక ఆరోపణలు, విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వర్కు టెండర్ విషయంలో గత ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్‌ను ఏకంగా వైసీపీ నేతలు బెదిరించడంతో సదరు కాంట్రాక్టర్ హైదరాబాద్‌లో కేసు పెట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వంలో ఏ వర్కుకూ బిల్లు రాకపోయినా పెన్నా వాల్స్ వర్కుకు మాత్రం ఎప్పటికప్పుడు బిల్లులు ఇచ్చేశారు. ఇదెలా సాధ్యమైందని అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ల వర్గాల్లో మొదటి నుంచీ చర్చ జరుగుతోంది. వర్కు డిజైన్, నాణ్యతపైనా ఫిర్యాదులు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా పెన్నా వాల్స్ వర్కు వివాదాల సుడి నుంచి బయటపడటం లేదు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో ఈ వర్కు జరుగుతుండగా, దీనికి సంబంధించిన కనీస సమాచారాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగూరు నారాయణకు ఇరిగేషన్ అధికారులు చెప్పిన దాఖలాలు లేవని తెలుస్తోంది. అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో కనీస సమాచారం కూడా ఇవ్వకుండా పనులు చేయడాన్ని మంత్రి నారాయణ తప్పుబట్టారు. తనకు తెలియకుండా పనులు ఎలా చేస్తారంటూ ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం నెల్లూరులో పర్యటించిన సందర్భంగా పెన్నా వాల్స్ వర్కుపై సమీక్షించిన నారాయణ.. ఇరిగేషన్ అధికారుల తీరుపై అసహనం చెంది, వెంటనే పనులు ఆపాలని ఆదేశించారు. అప్పటి నుంచి పనులు జరగ డం లేదు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పనులు జరగడం లేదు

మంత్రి సమావేశానికి నేను వెళ్లలేదు. మా సిబ్బంది అక్కడ జరిగిన విషయాలు చెప్పారు. పెన్నా ప్రొటెక్షన్ వాల్స్ పనులు ఆపాలని మంత్రి ఆదేశించారు. వారం రోజులుగా పనులు జరగడం లేదు.

- కే నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ

● మంత్రికి అందిన ఫిర్యాదులు

2020, 2021 సంవత్సరాల్లో పెన్నాకు భారీ వరదలు రావడంతో భగత్‌సింగ్ కాలనీ, వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డికాలనీల్లోకి నీరు చేరింది. దీంతో ఆ ప్రాంతంలో పొర్లుకట్ట నిర్మించాలని నిర్ణయించారు. ఎగువ భాగంలో కూడా మట్టికట్టే ఉండటంతో అదే మాదిరి దిగువన కూడా కట్టి రివిట్‌మెంట్ చేయాలని నిర్ణయించి సుమారు రూ.100 కోట్లతో టెండర్లు పిలిచారు. అయితే వైసీపీ నేతలు అనుకున్న వ్యక్తికి టెండర్ దక్కకపోవడంతో ఆ టెండర్‌ను రద్దు చేశారు. ఈదఫా మట్టికట్ట స్థానంలో కాంక్రీట్ వాల్ వచ్చింది. మళ్లీ టెండర్ పిలిచి పనులు అప్పగించారు. రెండేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఇప్పటికి మూడేళ్లు గడిచినా సగం పనులు కూడా పూర్తి కాలేదు. 2 కిలోమీటర్లు నిర్మించాల్సిన ప్రొటెక్షన్ కాస్తా 650 మీటర్లకు తగ్గిపోయింది. మిగిలిన 1.35 కిలోమీటర్లకు కాంక్రీట్ వాల్ నిర్మించాలంటే మరో రూ.197 కోట్లు అవసరమవుతుందని ఇరిగేషన్ అధికారులు గత నవంబరులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు నేపథ్యంలో ఇది ప్రభుత్వ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు వాల్‌ను పెన్నా ఒడ్డున నిర్మించాల్సి ఉండగా, నదిలో నిర్మిస్తూ నది డిశ్చార్జిని తగ్గిస్తున్నారన్న ఫిర్యాదులు మంత్రికి అందాయి. అలానే నాణ్యమైన ఇసుకతో పనులు చేయకుండా పక్కనే నదిలో ఉన్న ఇసుకనే ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా పెన్నా వాల్స్ వర్కు ఎగ్జిక్యూషన్ కూడా వివాదాస్పదంగా మారింది. తొలుత తెలుగుగంగ అధికారులు టెండర్లు పిలవగా, ఆ తర్వాత ఇరిగేషన్ సర్కిల్ నెల్లూరు సబ్ డివిజన్ పర్యవేక్షించింది. ఆ తర్వాత ఈ వర్కును కోవూరు డ్రైనేజీ డివిజన్ కిందకు మార్చారు. మళ్లీ ఇటీవల బుచ్చి సబ్ డివిజన్ కిందకు తీసుకెళ్లారు. ఇలా అధికారులు వర్కు నాణ్యతతో బంతాట ఆడుకుంటున్నారు. దీనిపై కూడా కొందరు టీడీపీ నేతలే మంత్రి నారాయణకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయాలపై ఇరిగేషన్ అధికారులు మంత్రికి సమాచారం గానీ, వివరణ గానీ ఇవ్వకుండా పనులు మొదలుపెట్టించి చేయిస్తున్నారు. దీంతో మంత్రి ఆగ్రహించినట్లు ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. తదుపరి మంత్రి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ఆసక్తిగా మారింది.



పెన్నా నదిలో జరుగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

వేదాయపాళెం సీఐ శ్రీనివాసరావు



నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : వరుస హత్యలతో నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్ రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిలో పడింది. స్టేషన్ పరిధిలో జరిగిన హత్యతో ఓ సీఐను సైతం వీఆర్‌కు పిలవడంతో ఆ స్టేషన్‌కు వచ్చేందుకు పోలీసు అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేదాయపాళెం స్టేషన్ సీఐగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని, విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఆయన తెలిపారు. పలు అంశాలపై ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

? రౌడీషీటర్లపై ఎలాంటి దృష్టి సారించారు.

! స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాము. రౌడీషీటర్లను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించాము. ఏ కేటగిరి వారిపై నిరంతర నిఘా ఉంచుతూ వారిని తరచూ స్టేషన్‌కు పిలిపిస్తున్నాము. ప్రతీ కానిస్టేబుల్‌కు ఒకరు లేదా ఇద్దరు రౌడీషీటర్లను కేటాయించాము. రెండు రోజులకు ఒకసారి కానిస్టేబుళ్లు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడుతూ ఫొటోలు తీసి గ్రూపులో పెట్టాల్సి ఉంటుంది.

? నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాము. ప్రతీ రోజు స్టేషన్ పరిధి మొత్తం స్వయంగా నేనే తనిఖీ చేస్తున్నాను. ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాము. శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాను డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాము. మద్యం దుకాణాలు, బార్ల ముందు మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటున్నాము. రాత్రి వేళ పని లేకుండా రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటున్నాము.

? నేరాలను ఎలా అరికడతారు

! ఎక్కువ నేరాలు చేసిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నాము. ఇప్పటికే పలువురిపై దాన్ని ప్రయోగించారు. నేర ప్రవృత్తి కలిగిన మరికొందరిపై కూడా పీడీ యాక్ట్ నమోదుకు సిద్ధమవుతున్నాము. నేరస్థులను బైండోవర్ చేస్తున్నాము. అప్పుడు కూడా నేరాలకు పాల్పడితే వారి ఆస్తులు జప్తు చేస్తాము.

? పేకాట, వ్యభిచార గృహాల కట్టడి ఎలా.

! స్టేషన్ పరిధిలో పేకాట, వ్యభిచార కేంద్రాలు, గంజాయి విక్రయాలు, సేవించడం వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాము. వరుసగా పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్నాము. నిర్వాహకులను అరెస్ట్ చేసి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాము. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ప్రజలు 9440796304 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరుతున్నాము. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాము.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య

● మంత్రి నారాయణ కుమార్తె శరణి

నెల్లూరు(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందించేందుకు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ మహా సంకల్పానికి శ్రీకారం చుట్టారని ఆయన కుమార్తె శరణి తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆమె మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పనులన్నీ వేగవంతంగా నాణ్యతతో జరుగుతున్నాయని చెప్పారు. పాఠశాలలో ల్యాబ్‌లు, డ్యాన్స్, మ్యూజిక్, డ్రాయింగ్ రూములు, క్రీడామైదానం సహా అన్నీ రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 12న పాఠశాలను పునః ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

స్థల దాత విగ్రహం ఏర్పాటు చేయండి

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : పునర్నిర్మాణం జరుగుతున్న వీఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఆ స్థల దాత విగ్రహం ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిచ్చిన పీ4 పథకానికి స్ఫూర్తి తేవాలని ఏ ట్రస్ట్ ఎ ఫర్ ఆల్ సంస్థ తరఫున అళహరి వెంకటేష్, సభ్యులు కోరారు. ఈ మేరకు ఆ పాఠశాల ఆధునీకరణ పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె శరణికి మంగళవారం వినతిప్రతం అందజేశారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.

4 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్ యోగా

నెల్లూరు(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాన్ని జూన్ 4 నుంచి 10వతేదీ వరకు నగరంలోని బీవీనగర్ సంఘమిత్ర విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్ డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాచీన యోగశాస్త్రాల సారం అయిన ఇన్నర్ ఇంజనీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకి బాటలు వేయడంతోపాటు ఆనందకరమైన జీవనానికి దోహదపడుతుందన్నారు. ఆదివారం మినహా సంబంధిత తేదీల్లో అన్నీ రోజులూ ఉదయం, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈషా డాట్‌కో ఇన్నర్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఏసీ బస్‌షెల్టర్లను పరిశీలిస్తూ ఉండండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), మే 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ బస్‌షెల్టర్లను అధికారులు వీలైనప్పుడల్లా పరిశీలిస్తూ ఉండాలని నగర కమిషనర్ నందన్ సూచించారు. మంగళవారం నగరంలోని పలు బస్‌షెల్టర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం 38వ డివిజన్ టెక్కేమిట్ట వద్ద డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను తనిఖీ చేశారు. మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్లో ఆహార నాణ్యతను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. 29వ డివిజన్ మహాత్మాగాంధీ నగర్‌లోని రోడ్డు ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం లో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమై సోలార్ విద్యుత్‌పై నగర వాసుల్లో అవగాహన పెంచాలని కోరారు. యోగాంధ్ర 2025 పోటీల్లో నగర వాసులు పాల్గొనాలని పిలుపునిస్తూ మినీ పోస్టర్లను ఆవిష్కరించారు. అమృత పథకం డీఈ మాధూరి కూడా పాల్గొన్నారు.



బస్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

జాషువా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతాం

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాషువా ప్రజా గ్రంథాలయాన్ని బహుళార్థ ప్రయోజనకారిగా తీర్చిదిద్దుతామని కార్పొరేషన్ కమిషనర్ నందన్ చెప్పారు. మంగళవారం ఉదయం ఆయన మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి జాషువా గ్రంథాలయాన్ని సందర్శించారు. అర్ధంతరంగా ఆగిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను తొందరలోనే పునఃప్రారంభించి పూర్తి చేయిస్తామని చెప్పారు. గ్రంథాలయానికి వెళ్లే మార్గానికి గుర్రం జాషువా స్ట్రీట్‌గా నామకరణం చేస్తామని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్‌కే ఖాసిం, ఈసీ మెంబర్లు గంధం అంకయ్య, ఏవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తమ్ముళ్లు

నెల్లూరు (వైద్యం), మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనడానికి ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, అనుచరులు మంగళవారం తరలి వెళ్లారు. ముందుగా నగరంలోని నర్తకీ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మవరం మాట్లాడుతూ టీడీపీ అంటేనా కార్యకర్తల పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, నాయకులు కల్వకుంట్ల భాస్కర్, ర త్నం, మునికుమార్, సుధా, మునికృష్ణ, కంచికృష్ణ, సురేంద్ర సింగ్ పాల్గొన్నారు.

'సమాజ సేవ అందరి బాధ్యత'

నెల్లూరు (సాంస్కృతికం), మే 27(ఆంధ్రజ్యోతి) : సమాజంలో పేద, బడుగువర్గాల తోపాటు పరిసరాల అభివృద్ధి అందరి బాధ్యత అని కస్టమ్స్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉషా కిరణ్, డాక్టర్ ఉషాకిరణ్ రాయ్ తెలిపారు. మంగళవారం అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో జరిగిన సేవా కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ప్రతీనెల 350 మందికి పోషకాహార కిట్స్ అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటస్ నిర్మల కుమార్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో జయప్రకాష్, వెల్డింగ్‌స్టన్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేప ఎగిరిందా.. వలకు చిక్కాల్సిందే !

సంగం, (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మత్స్యకారులు నిలకడ నీటిలో లేదా ప్రవహించే నీటిలో చేపలవేట సాగిస్తారు. కానీ కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్ల వద్ద నీటి ప్రవాహం ఎక్కువ గా ఉండడంతో వలలు వేయడానికి వీలు పడదు. దీంతో మత్స్యకారులు రెగ్యులేటర్ల ముందు భాగం లో వరుసగా వలలు వేలాడ దీశా రు. నీటి ప్రవాహానికి చేపలు ఎదురీ దే క్రమంలో ఎగిరి వలలో చిక్కుకుంటున్నాయి. చేపలు వేట సాగించకుండా ఈ పద్ధతి గమ్మత్తుగా ఉంది. వేట చేతకాని మత్స్యకారు లు సైతం వలలు వేసి చేపలు పడినప్పుడు పైకి లాగి బుట్టలో వేసుకుంటున్నారు.



రెగ్యులేటర్ల ముందు వేలాడదీసిన వలలు

సేవాభావంతో వివాహ సంబంధాలు కుదర్చండి

● మ్యారేజీ మీడియేటర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్టాభిరామయ్య

నెల్లూరు (సాంస్కృతికం), మే 27 (ఆంధ్రజ్యోతి) : వివాహ సంబంధాలను సేవా భావంతో కుదర్చాలని, వ్యాపారం చేయవద్దని మ్యారేజీ బ్యూరోలకు న్యూ సమాఖ్య మ్యారేజీ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసగిరి పట్టాభిరామయ్య సూచించారు. మంగళవారం అరవిందనగర్‌లోని మీసేవా భవన్‌లో ఆ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు జరిగింది. నాలుగు జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. పెండ్లి సంబంధాలు కుదర్చడానికి మీడియేటర్స్ లక్షలకు లక్షలు కమిషన్ డిమాండ్ చేస్తూ మ్యారేజీ మీడియేషన్‌కి చెడ్డపేరు తెస్తున్నారన్నారు. మీడియేటర్స్‌కి సమస్యలు ఎదురైతే జిల్లా కార్యవర్గానికి ఫిర్యాదు చేయాలని, అవసరమైతే రాష్ట్ర కార్యవర్గం కూడా సహకరిస్తుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాయిప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షుడు హరి నారాయణ రెడ్డి, రాయలసీమ చైర్మన్ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సుకు మీడియేటర్స్, సంఘం నాయకులు

ఆడిటర్ సీవీ సుబ్రహ్మణ్యం మృతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రముఖ ఆడిటర్, ఆధ్యాత్మిక సేవకుడు సీవీ సుబ్రహ్మణ్యం (71) మంగళవారం కన్నుమూశారు. ఆయన చెన్నైలో వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నారు. అది వికటించడంతో ఆసుపత్రిలోనే మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. సుబ్బప్పగా పిలుచుకునే సుబ్రహ్మణ్యం జిల్లా ధార్మిక పరిషత్ అధ్యక్షుడిగా నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రతీనెల శ్రవణ నక్షత్రం రోజు శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహించేవారు. మన గుడి, సామూహిక కల్యాణమస్తు వంటి కార్యక్రమాలతోపాటు జిల్లా వ్యాప్తంగా ధార్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయన మృతికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పలువురు ప్రజాప్రతి నిధులు, టాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా ధార్మిక మండలి మాజీ సభ్యులు సంతాపం తెలిపారు.

నేడు డాక్టర్ విజయకుమార్ వర్ధంతి

ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వేణు నర్సింగ్‌హోమ్‌లో బుధవారం జిల్లాలో జేవీవీ వ్యవస్థాపకుడు, నెల్లూరు వైద్యశాల స్థాపకు డు డాక్టర్ విజయకుమార్ 10వ వర్ధంతి నిర్వహించనున్నట్లు జేవీవీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ గాజుల మున్నా, మహమ్మద్ అలీ మంగళ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కే.వేణుగోపాల్ హాజరవుతారన్నారు. అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), మే 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ దగ్గర రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నందున బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గుర్తించాలని కోరారు.

కందుకూరి సంస్కరణలు అజరామరం

నెల్లూరు (సాంస్కృతికం) మే 27 (ఆంధ్రజ్యోతి) : నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు చేపట్టిన సంఘ సంస్కరణలు అజరామరం అని పట్టణ ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో కందుకూరి వర్ధంతి నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఆయనకు నివాళి అర్పించారు. వీరేశలింగం పంతులు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం అర కొరే!

- ఎటు చూసినా మద్యం సీసాలు, గ్లాసులే!
- మెట్లపై గుట్కా, పాన్‌ల మరకలు..
- వెదజల్లుతున్న దుర్వాసన..
- ఇదీ ఎన్టీఆర్ ఘాట్ దుస్థితి

నెల్లూరు(వ్యవసాయం), మే 27(ఆంధ్రజ్యోతి): ఓవైపు చెరువు.. మరోవైపు ఆధ్యాత్మిక కేంద్రాలు.. మధ్యలో రహదారి.. ఇదో ఆహ్లాదకరమైన ప్రదేశం.. అందుకనే ఉదయం, సాయంత్రం ఇక్కడ కాసేపు గడిపేందుకు కొందరు.. చల్లటి ఆరోగ్యకరమైన గాలిని పీల్చుకుంటూ నడక సాగించేందుకు మరికొందరు.. ఆధ్యాత్మిక ప్రదేశం కావడంతో కుటుంబాలతో కలిసి ప్రశాంతకరమైన వాతావరణంలో గడిపేందుకు నిత్యం అక్కడకు వస్తుంటారు.. అయితే అక్కడి పరిసరాలు మాత్రం అపరిశుభ్రంగా ఉంటున్నాయి. చల్లని గాలికి బదులుగా దుర్వాసన, ఎటు చూసినా మద్యం బాటిళ్లతో ఆప్రాంతం నిండిపోయి ఉంది. ఇదీ నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి గుడి సమీపంలో నెల్లూరు చెరువుకట్టపై ఉన్న ఎన్టీఆర్ ఘాట్ దుస్థితి. ఆహ్లాదం సంగతి దేవుడెరుగు.. కాసేపు కూర్చోవాలంటే మంచి స్థలం కోసం వెతుక్కునే పరిస్థితి నెలకొంది.

నగరంలోని నెల్లూరు చెరువు కట్టను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి నారాయణ రూ.30కోట్లతో నెక్లెస్ రోడ్డుగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో అవాంతరాల అనంతరం ఎన్టీఆర్ ఘాట్‌గా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఇరగాళమ్మ దేవస్థానం సమీపంలో చెరువులో ఘాట్ ఏర్పాటు చేసి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. దీంతో నగర ప్రజలు ఉదయం, సాయంత్రం సమయాల్లో సేద తీరేందుకు ఇక్కడకు వస్తుంటారు. ఓవైపు అమ్మవారు మరోవైపు శివాలయం ఉండడంతో ఆధ్యాత్మికంగా కూడా బాగా ప్రాచుర్యం పొందుతోంది. దీంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. పక్కనే నెల్లూరు చెరువు కూడా ఉండటంతో కుటుంబాలుగా వచ్చి ఆలయాలను దర్శించి ఘాట్‌లో ఆనందంగా గడుపుతున్నారు.



ఉదయం, సాయంత్రం వాకర్స్ కూడా వస్తున్నారు. ప్రారంభంలో ఎంతో మందికి ఆహ్లాదం పంచిన ఈప్రాంతం ప్రస్తుతం అపరిశుభ్ర వాతావరణంతో దుర్వాసన వెదజల్లుతోంది. అమ్మవారి గుడి వద్ద మెట్లపై కూర్చొనే పరిస్థితి లేకుండా పోయింది. గుట్కా, పాన్ మసాలాల మరకలతోపాటు అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంది. ఎటు చూసినా మద్యం బాటిళ్లు, గ్లాసులు, చెత్తాచెదారాలతో నిండిపోయింది. అయినప్పటికీ కొంత మంది వాకర్స్ వస్తున్నప్పటికీ మితిమీరిన వేగంతో యువత ద్విచక్ర వాహనాలతో ఈప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతానికి వచ్చే వారు భయాందోళన చెందుతున్నారు. వాహనాల రాకపోకలను అడుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● అమ్మవారి ఆలయం సమీపంలోనే మద్యం..

ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పక్కనే పగలు రాత్రి అని తేడా లేకుండా కొందరు మద్యం సేవిస్తున్నారు. ఇక ఘాట్ రోడ్డులో ఎటు చూసినా మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులే దర్శనమిస్తున్నాయి. అక్కడి శివాలయం సమీపంలో మద్యం కొనుగోలు చేసిన మద్యం బాబులు ఘాట్ రోడ్డుపైకివచ్చి ప్రశాంతంగా మద్యం సేవిస్తున్నారు. వారిని ప్రశ్నిస్తే ఇక దాడులే!. దీంతో వారిని వారించే వారు లేకుండా పోయారు. అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో, వాటి వెనకాల నిత్యం మద్యం బాబులే కనిపిస్తున్నారు. అర్ధరాత్రిళ్లు సైతం అక్కడ మద్యం అమ్మకా లు జరుగుతున్నాయని కొంతమంది స్థానికులు చెబుతున్నారు. దేవస్థానం అధికారులతోపాటు పోలీసులు ఈ ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన ప్రాంతంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



గుడి ఎదుట మద్యం సీసాలు



ఘాట్‌లో మెట్లపై గుట్కా, పాన్ మరకలు





మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.




రేపటి నుంచి 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

నెల్లూరు(వ్యవసాయం), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నుంచి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 12వతేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవీకే బృందం, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు సంయుక్తంగా జిల్లాలోని 38 మండలాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఇతర రంగాలపై రైతులతో చర్చిస్తారని, ఇఫ్కో వారి సహకారంతో డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శన చేపడతామని తెలిపారు. చీడపీడలు, ఇతర సమస్యలకు నివారణ మార్గాలు సూచిస్తారని వివరించారు. ఈ కార్యక్ర మాల్లో రైతులు పాల్గొనాలని కోరారు.

దేశ సమగ్రత కోసమే సమైక్యత యాత్ర

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి) : దేశసమగ్రత కోసమే సీపీఎం సమైక్యత యాత్రలు ప్రారంభించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. మంగళవారం కావలి పట్టణంలో సమైక్యత యాత్ర ప్రదర్శన జరిగింది. ఏరియా వైద్యశాల నుంచి ప్రారంభమై కోర్టు సెంటర్, కూరగాయల మార్కెట్ మీదుగా తిరిగి ఉదయగిరి బ్రిడ్జిసెంటర్‌కు యాత్ర చేరుకుంది. ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మూలం రమేష్ మాట్లాడుతూ కశ్మీర్ పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో 26 మంది చనిపోయారన్నారు. వారిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన రావు కూడా ఉన్నారని వారి కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. కాల్పులు జరిపిన ఉగ్రవాదులలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకున్న దాఖలాలు లేవన్నారు. పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం చేస్తుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం విరమించాలని కోరగానే భారత్ వెంటనే యుద్ధం విరమించిందన్నారు. భారతదేశంపై అమెరికా అధ్యక్షుడి పెత్తనం ఏమిటని, దీని వలన భారతదేశ సౌరభౌమాధికారం దెబ్బతింటుందన్నారు. కొంత మంది మతోన్మాదులు దేశప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇలాంటి దుర్మార్గాలను దేశ ప్రజలు సమైఖ్యంగా ఉండి తిప్పి కొట్టాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ పార్టీ తీసుకువస్తున్న ప్రమాదకరమైన విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఎం సమైక్యతా యాత్రలు జరుపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.పుల్లయ్య, వీ.పెచలయ్య, ఎస్.వెంకయ్య, పీ.తిరిపాలు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కావలిలో సమైక్యత యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

లాడ్జి టాయిలెట్‌లో ఒకరి మృతి

- రెండు నెలల క్రితమే వివాహం
- అనారోగ్యమే కారణమంటున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కారనిమిట్ట గ్రామానికి చెందిన పెద్ద గురవయ్య, వెంకమ్మ దంపతులకు నలుగురు సంతానం. పెద్ద కుమారుడు సమ్మిటి విజయకుమార్ మదనపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. రెండు నెలల కిందట ఆయనకు ఉషాతో వివాహం అయ్యింది. ఈ నెల 26వ తేదీ ఉదయం విజయకుమార్ ఇంటి నుంచి మదనపల్లికి ఉద్యోగ నిమిత్తం వెళ్లారు. వైద్యశాలలోని డాక్టర్ మందులు తీసుకురావాలని చెప్పగా అదేరోజు నెల్లూరుకు వచ్చారు. ఆర్టీసీ బస్టాండు లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాడ్జిలో టాయిలెట్‌కి వెళ్లారు. అక్కడే కుప్పకూలి పోవడంతో గమనించిన లాడ్జి సిబ్బంది చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. విజయకుమార్ తమ్ముడు చందుకు ఫోన్ చేసి విషయం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం ఉదయం విజయకుమార్ కుటుంబ సభ్యులు నెల్లూరుకు చేరుకొని కన్నీరు మున్నీ రయ్యారు. చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు అనారోగ్యంతోనే విజయకుమార్ మృతి చెందాడని భావిస్తున్నారు.

రైతులకు వరం ఎఫ్‌పీవో

దీనిపై అవగాహన తెచ్చుకోవాలి : కలెక్టర్

అల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌పీవోపై (ఫార్మర్ ప్రొక్యూర్ ఆర్గనైజేషన్) అవగాహన కలిగి అందులో సభ్యులుగా మారితే తద్వారా వచ్చే ఫలాలను అందుకోవచ్చని కలెక్టర్ ఆనంద్ రైతులతో అన్నారు. 2025-26 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ చమురు విత్తనాల దిగుబడిని పెంచే కార్యక్ర మంలో భాగంగా అల్లూరు మండ లం తూర్పు గోగులపల్లి చంద్రశేఖర పురంలో నిర్వహించిన వేరుశనగ విత్తనాల పంపిణీకి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 200 మంది రైతులు కలిసి ఎఫ్‌పీవోను ఏర్పాటు చేసుకుంటే సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితరాలు తక్కువ ధరకే పొందడంతోపాటు దిగుబడు లను మార్కెట్లో అత్యధిక ధరకు విక్రయించు కునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ముందుగా అవగా హన వచ్చేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని వ్యవసాయాధికారులు, ఎఫ్‌పీవో ప్రతినిధులను ఆదేశించారు. వేరుశెనగ పంటను అభివృద్ధి చేసేందుకు ఎంపికైన రైతు లకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఆత్మ పీడీ శివనారాయణ, జిల్లా కోఆపరేటివ్ మేనేజరు గుర్రప్ప, ఎఫ్‌పీవో ప్రతినిధి గోపిరెడ్డి, ఏడీఏలు నాగరాజు, నర్సోజి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

సోమశిలలో 43.653 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామ ర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళ వారం నాటికి 43.653 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 162 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా పెన్నా డెల్టాకు 3,000, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నా మని వారు పేర్కొన్నారు.

వైద్యుల సిఫార్సు లేకుండా స్కానింగ్ చేయొద్దు

- జిల్లా స్థాయి సలహా మండలిలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మే 27 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వైద్యుల సిఫార్సు లేకుండా ఎలాంటి పరిస్థితిలోనూ స్కానింగ్ పరీక్షలు చేయరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో మంగళవారం గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టం అమలుకు జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆర్‌ఎంపీలు సిఫార్సు చేస్తే స్కానింగ్ తీయకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నెలకు 10 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించా లని తీర్మానించారు. జిల్లా స్థాయి సలహా సంఘం అధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో భ్రూణహత్యలు అరికట్టే దిశగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆడిపిల్ల పుట్టుక ఆవశ్య కతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిం చాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ, వైద్యాధికారులు డాక్టర్ సర్ధాన్ సుల్తానా, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ దయాకర్, సదారావు, డెమో కనకరత్నం, ఎన్‌జీవో ప్రతినిధులు కవితారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

పంచాయతీలకు రూ. 70 కోట్ల ఆర్థిక సంఘం నిధులు : డీపీవో

సంగం, మే 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లాలోని పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ. 70 కోట్ల మేరకు నిధులు మంజూరయ్యాయని డీపీవో శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వర్మికంపోస్టు తయారీ పనితీరును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఇంటింటా చెత్త సేకరణ, తడి,పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి, వర్మి కంపోస్టు తయారు చేసి విక్రయించి సంపద సృష్టించడం, పారిశుధ్యం, తాగునీటి పంపిణీ, వీధిలైట్ల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల వివరాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌లో నమోదుపై వివరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 200 పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ జరుగుతుందన్నారు. చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో 60 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. దీన్ని 80 శాతం పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో అక్రమాలకు పాల్పడిన 20 మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశామని, అక్రమాలు అరికట్టేందుకు పంచాయతీలో జరిగే కార్యక్రమాలతోపాటు నగదు లావాదేవీలన్ని స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌లో నమోదుకు ఆదేశించామన్నారు. పంచాయతీల్లో జరిగే పారిశుధ్య కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో షాలెట్, డీఎల్‌పీవో, ఈవోఆర్డీ, పీఆర్ ఏఈ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

ఉద్యోగులపై ఆరోపణలు వస్తే కఠిన చర్యలు

విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మే 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడినా, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను, ఉద్యోగులను హెచ్చరించారు. ఆయన చాంబర్ నుంచి మంగళవారం జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీ అధికారి, ఉద్యోగి వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా తదితర సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. వచ్చే నెల 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవానికి ఉద్యోగులంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నేడు డాక్టర్ విజయకుమార్ వర్ధంతి

ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వేణు నర్సింగ్‌హోమ్‌లో బుధవారం జిల్లాలో జేవీవీ వ్యవస్థాపకుడు, నెల్లూరు వైద్యశాల స్థాపకుడు డాక్టర్ విజయకుమార్ 10వ వర్ధంతి నిర్వహించనున్నట్లు జేవీవీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ గాజుల మున్నా, మహమ్మద్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కే.వేణుగోపాల్ హాజరవుతారన్నారు. అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 99,900
వెండి ఒక గ్రాము	రూ. 102.90

న్యూస్ బాక్స్

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపాన వెలసిన గంగమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్య తిథి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం రవిశంకర్‌రెడ్డి

సంగం, మే 27 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఏపీఎం రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ బ్యాంక్ సిబిల్ స్కోర్‌ను బట్టి జిల్లాలో సుమారు 1500 మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేసేందుకు ప్రభుత్వం గుర్తించగా, అందులో సంగం మండలంలో 50 మంది మహిళలను ఎంపిక చేశామన్నారు. వీరందరికి వారు కోరుకున్న రంగంలో బ్యాంకుల ద్వారా పెట్టుబడి రుణం ఇప్పించి వ్యాపారం చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

'కందుకూరి'కి ఘన నివాళి

అనంతసాగరం మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో మంగళవారం సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 106వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గ్రంథపాలకుడు డీ. నారాయణరావు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వల్లూరు రాజేష్ రెడ్డి, కేడీపల్లి పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకుడు పీ. భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడిన గేదె రక్షించిన గ్రామస్థులు



మురుగు కాలువలో పడిన గేదెను బయటకు తీస్తున్న గ్రామస్థులు

సంగం, మే 27 (ఆంధ్రజ్యోతి): సంగం - ముంబాయి జాతీయ రహదారి పక్కన ఉన్న లోతైన మురుగు కాలువలో పడి, పైకి రాలేకపోయిన గేదెను మంగళవారం గ్రామస్థులు కాపాడారు. రహదారి పక్కన సుమారు ఐదు అడుగుల లోతున డ్రైనేజీ కాలువ ఉంది. గేదెలు పోట్లాడుకుంటూ ఓ గేదె కాలువలో పడింది. కాలువ లోతుగా, ఇరుకుగా ఉండడంతో పైకి ఎక్కలేకపోయింది. దీంతో స్థానికులు గేదెకు తాళ్లు కట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో పైకి లాగారు.

చేప ఎగిరిందా.. వలకు చిక్కాల్సిందే!



రెగ్యులేటర్ల ముందు వేలాడదీసిన వలలు

సంగం, (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మత్స్యకారులు నిలకడ నీటిలో లేదా ప్రవహించే నీటిలో చేపలవేట సాగిస్తారు. కానీ కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్ల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వలలు వేయడానికి వీలు పడదు. దీంతో మత్స్యకారులు రెగ్యులేటర్ల ముందు భాగంలో వరుసగా వలలు వేలాడ దీశారు. నీటి ప్రవాహనికి చేపలు ఎదురీదే క్రమంలో ఎగిరి వలలో చిక్కుకుంటున్నాయి. చేపలు వేట సాగించకుండా ఈ పద్ధతి గమ్మత్తుగా ఉంటుంది. వేట చేతకాని మత్స్యకారులు సైతం వలలు వేసి కాలయాపన చేస్తూ చేపలు పడినప్పుడు వల పైకి లాగి బుట్టలో వేసుకుంటున్నారు.

ఆగిన పనులు సాగేనా ?

● అప్రాన్ వర్కులు పూర్తికి ఇదే మంచి తరుణం ● నిర్లక్ష్యం వహిస్తే తప్పదు మూల్యం



సోమశిల ప్రాజెక్టు ముందు నిలిచిన అప్రాన్ పనులు

అనంతసాగరం మే 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద ఆగిన అప్రాన్ పనులకు మోక్షం ఎప్పుడో తెలియడంలేదు. పనులు చేసేందుకు ఇది మంచి తరుణం కాగా, ఆదిశగా చర్యలు కరువయ్యాయి. మూడేళ్లగా సాగుతున్న ఈ పనుల్లో సాగదీత కొనసాగుతుండగా కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల్లో చలనం వచ్చింది. సుమారు 29 శాతం పనులు జరిగాయి. మిగిలిన పనులు పూర్తయితే ఎగువ నుంచి ఏస్థాయిలో వరద వచ్చిన సోమశిల ప్రాజెక్టుకు ఎలాంటి ఆపద ఉండదు. పనులు పూర్తికాకపోతే.. రానున్న వర్షాకాలంలో వరద తాకిడి వల్ల చేసిన పనులు సైతం ధ్వంసమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే వర్షాలు కురుస్తుండగా, ఇక ఆగస్టు మొదటి వారంలో శ్రీశైలం నుంచి కృష్ణాజలాలు కూడా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.ఈ పరిస్థితులను పరిగణలోకి త్వరగా పనులు పూర్తిచేసి ప్రాజెక్టు మనుగడను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. కాగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఎస్ఈ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం



ఆత్మకూరులో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకుంటే ఒత్తిని నుంచి ఉపశమనం పొందవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో యూ. డేవిడ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల స్థాయి టీవోటీలకు శిక్షణ, యోగాసనాలు నిర్వహిచారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు, ప్రజలకు యోగాసనాలతో ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం ఏవో కే. శ్రీనివాసరావు ట్రైనీలుగా వ్యవహరించిన పీడీలు తిరుపతయ్య, సురేష్, సంధానిషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● **నేడు యోగాపై సమావేశం**

ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం సర్పంచులు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు యోగాపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 10న జిల్లాలో యోగాంధ్ర నిర్వహించేందుకు నాలుగు కేంద్రాలు మంజూరయ్యాయ న్నారు. అందులో ఉదయగిరి కూడా ఉండడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

● **రేపు యోగాంధ్రపై శిక్షణ**

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం యోగాంధ్రపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రయ్య తెలిపారు

ఉత్సాహంగా మహానాడుకు తరలిన నేతలు



మహానాడులో సీతారామపురం మండల టీడీపీ నాయకులు

సంగం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు టీడీపీ నాయకులు కడపలో జరిగే మహానాడుకు మంగళవారం తరలివెళ్లారు. మండలంలో శాశ్వత సభ్యత్వం ఉన్న టీడీపీ నాయకులతోపాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల కలిసి తొమ్మిది కార్లలో బయలుదేరి వెళ్లారు.

● **ఉత్సాహంగా మహానాడుకు...**

ఆత్మకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో టీడీపీ ఏర్పాటు చేసిన నూతన కమిటీల్లో వర్గరాజకీయాలకు అతీతంగా సామాజికన్యాయంతోపాటు యువతకు ప్రాధాన్యత కల్పించారు.దీంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లువిరిసింది. ఈ క్రమంలో కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు నియోజకవర్గం నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు తరలి వెళ్లాయి. మంగళవారం నియోజకవర్గం నుంచి 10 వేల మందికి తగ్గకుండా తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు.

● **మహానాడులో ఎస్ఆర్ పురం నాయకులు**

సీతారామపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు మండల టీడీపీ నాయకులు చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అక్కడ మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్‌ల దృష్టికి మండల సమస్యలను తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో నాయకులు కప్ప ప్రభాకర్‌రాజు, జాషువా, పిడుగు రమేష్, కలివెల జ్యోతి,చంద్రారెడ్డి, వికాష్‌బాబు, కిరణ్,తురక వెంకటేశ్వర్లు,సిద్దయ్య, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డును విస్తరించాలని ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న పబ్బులేటిపల్లి గ్రామస్థులు

సీతారామపురం, మే 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పబ్బులేటిపల్లిలోకి వెళ్లే లింకు రోడ్డును విస్తరించాలని కోరుతూ మంగళవారం గ్రామస్థులు సర్పంచి ఆదెయ్య ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్ తమ గ్రామంలోకి వచ్చే లింకు రోడ్డును చిన్నదిగా ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.ఆ లింకు రోడ్డును వెడల్పు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.అలాగే తమ గ్రామం నుంచి నిత్యం ఎంతో మంది విద్యార్థులు సీతారామపురం వెళుతుంటారని, వారి శ్రేయస్సు దృష్ట్యా జంక్షన్ పాయింట్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం... వినోదం !

● సందడిగా వేసవి విజ్ఞాన శిబిరాలు



గ్రంథాలయంలో కథ చెబుతుంటే ఆసక్తిగా వింటున్న చిన్నారులు

ఆత్మకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వేసవి సెలవుల్లో టీవీ చూస్తూ సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడితే ఏమవుతుంది.. విలువైన సమయం వృథా కావడంతోపాటు కొత్తగా నైపుణ్యాలు అభివృద్ధి కావని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు స్పందన లభిస్తోంది. విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందించే పలు కార్యక్రమాలను ఇక్కడ రూపొందించారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వేసవి శిబిరాల్లో కథలు చెప్పడం, కథలు వినడం, పలురకాల కథల పుస్తకాలు చదవడంపై ఆసక్తి చూపుతున్నారు. కథల వలన నీతి, సాహసం, నైతికత, సేవాభావం అలవడుతుంది. చిన్నారుల్లో విజ్ఞానం పెరుగుతుంది. అందుకే వేసవి శిబిరాల్లో పిల్లలకు విజ్ఞానం, వినోదం, హాస్య కథలు చెప్పి మానసిక వికాసం, ఆలోచనశక్తి పెంపొందించుకునేందుకు చందమామ, బాలభారతం, రామాయణం, కాశీమజిలీ, పంచతంత్రం, తదితర నీతి, చారిత్రక, హాస్య కథలు చెప్పిస్తున్నారు. ముందుగా పుస్తకంలో కథను చదివిస్తున్నారు. తరువాత పుస్తకం చూడ కుండా కథ చెప్పిస్తున్నారు. కథ చెప్పే విధానానికి అనుగుణంగా బహుమతులు అందజేస్తున్నామని గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరాజు తెలిపారు. కథలు చదవడం, రాయడం వలన పిల్లల్లో నైపుణాలు పెరుగుతాయన్నారు.

చిట్టడవి కాదు.. బీఎస్ఎన్ఎల్ కార్యాలయమే !



ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూశారా.. చిట్టడవి అనుకుంటే పొరపాటే. అది బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణం. కార్యాలయ ఆవరణలో సెల్‌టవర్ ఉన్న ప్రాంతం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడంతో ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే కార్యాలయ ఉద్యోగులు సైతం అక్కడే ఉంటారు. విషపురుగుల బెడద కూడా ఉంది. ఈ చిట్టడవిని చూసి స్వచ్ఛాంధ్ర అంటే ఇదేనా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలి.



పాఠశాలల పునఃప్రారంభం నాటికే విద్యార్థి మిత్ర కిట్లు

-తోట శ్రీనివాసులు, ఎంఈవో-2

ఉదయగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం నాటికే విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే మండలానికి సంబంధించి విద్యార్థి కిట్లు చేరాయన్నారు.

? : మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి.

! : మండలంలో మొత్తం 69 పాఠశాలలు ఉండగా 4,446 మంది విద్యార్థులు ఉన్నారు. 241 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

? : విద్యార్థిమిత్ర కిట్లు వచ్చాయా.

! : మండలానికి ఇప్పటి వరకు నోట్ పుస్తకాలు 17 వేలు, బెల్టులు పూర్తి వచ్చాయి. 14,400 పాఠ్యపుస్తకాలకుగాను 14,004 వచ్చాయి. బూట్లు, బ్యాగులు, యూనిఫాం దుస్తులు రావాల్సి ఉంది.

? : పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా.

! : మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రస్తుతం జరగనున్న బదిలీల్లో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశముంది.

పింఛన్, రేషన్ ఇచ్చి ఆదుకోండి సార్!




దీనంగా ఉన్న దివ్యాంగ వృద్ధురాలు

వింజమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): తనకు పింఛన్‌తోపాటు రేషన్ ఇచ్చి ఆదుకోవాలని వింజమూరు జీబీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల పోలమ్మ అనే దివ్యాంగురాలు ప్రభుత్వాన్ని వేడుకుంది. తనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు అందడంలేదని, పెన్షన్, రేషన్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రమాదవశాత్తు 16 ఏళ్ల కిందట కాలు విరిగి మంచానికే పరిమితమయ్యానని, ఎటువంటి ఆధారం లేకుండా బతుకుతున్నానని, ఇరుగు పొరుగువాళ్ల సహాయం చేస్తే జీవనం వెళ్లదీస్తున్నానని పేర్కొన్నారు.తన దీనస్థితిని చూసి కొందరు సాయం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన బాధలను అర్థం చేసుకుని పెన్షన్, రేషన్ అందించాలని ఆమె కోరారు.

గ్రామాలకు నడవని పల్లె వెలుగు బస్సులు

● భారమవుతున్న గ్రామీణుల ప్రయాణం



వింజమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీలకు పల్లెవెలుగు బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నదని గ్రామస్థులు తెలిపారు. పల్లె వెలుగు పేరుతో ప్రతి గ్రామానికి బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. అయితే ఆదాయం రావడంలేదని సాకుతో పల్లెలకు బస్సులు నిలిపివేశారని గ్రామీణులు తెలిపారు. దీంతో ఆటోవాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు పరిమితికి మించి ఎక్కించడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరి దారుణంగా ఉందని వారు పేర్కొన్నారు. గతంలో ప్రతి ఊరుకు బస్సు వచ్చేదని తర్వాత ఆదాయం రావడంలేదని సాకుతో బస్సులు నిలిపివేశారని తెలిపారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్ల సౌకర్యం బాగా ఉందని ఆర్టీసీ వారు బస్సులు నడపాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

చంపుతామని బెదిరించిన ముగ్గురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని కత్తితో చంపుతామని బెదిరించి, దాడి చేసి నగదు దోచుకెళ్లిన ముగ్గురు నిందితులను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఆ స్టేషన్‌లో సీఐ దశరథ రామారావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరులోని సంతపేటకు చెందిన ఉడత నీరద్‌శ్యాం అనే వ్యక్తి ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున రోడ్డుమీద ఉండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. అతను ఇవ్వనని చెప్పడంతో నిందితులు ఇటుక రాయి, బీరు బాటిల్, నెయిల్ కట్టర్‌తో బెదిరించి దాడి చేసి రూ.1500 నగదు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో సీఐ దశరథ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. సాంకేతికత ఆధారంగా ముగ్గురు నిందితులు పాత నేరస్తులైన షేక్ నవాజ్, షేక్ అబ్దుల్ సుబహాన్ అలియాస్ చోటు, షేక్ అబ్దుల్ సమద్‌గా గుర్తించారు. వారిపై వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నాయి, పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చారు. ఆ ముగ్గురు నిందితులను మంగళవారం రంగనాయకులపేట రైల్వే గేటు సమీపంలో అరెస్ట్ చేశారు. నెయిల్ కట్టర్, రూ.450 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడిచేసిన ముగ్గురు నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కోటమిట్టకు చెందిన షేక్ ఇంతియాజ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఈ నెల 25న తన బాబాయి నిస్సార్ ఇంటికి బైక్‌పై వెళుతుండగా వాహనం అదుపుతప్పి మరో బైక్‌పై పడ్డాడు. దీంతో అక్కడున్న షైజుల్లాఖాన్, అతని అల్లుడు, దుకాణంలో పని చేస్తున్న మరో వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంతియాజ్‌పై దాడి చేశారు. గాయపడ్డ బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స అనంతరం మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ షేక్ అబ్దుల్ రజాక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో డీజే ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... కోవూరుకు చెందిన పీ బాబూరావు(30), కపాడి పాళేనికి చెందిన భవానీ పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. బాబూరావు డీజేగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ కపాడిపాళెంలోనే నివసిస్తున్నారు. కొంత కాలంగా భార్య, భర్తలు మనస్పర్థలతో తరచూ గొడవపడుతున్నారు. ఈ క్రమంలో నెల కిందట బాబూరావు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోయాడు. భార్య, భర్తల గొడవల నేపథ్యంలో మనస్థాపానికి గురైన ఆయన 20 రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు చికిత్స చేయించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈనెల 25వ తేదీన పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని అజంతా లాడ్జిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం రాత్రి లాడ్జి గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం లాడ్జి సిబ్బంది గమనించి యాజమాన్యానికి తెలిపారు. సమాచారం అందుకున్న సంతపేట ఎస్ఐ జీ బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బాబూరావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ఇద్దరి అదృశ్యం

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు వేదాయపాళెం స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని సుందరయ్య కాలనీ బీబ్లాక్‌లో కే శ్రీనివాసులు కుటుంబం నివసిస్తోంది. ఆయన కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 29వ తేదీ కూలిపనికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు మణి సోమవారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బుజబుజ నెల్లూరులో మహేంద్ర, సాయికుమారి దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయికుమారి పడారుపల్లిలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తానని అత్త అరుణకు చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో మహేంద్ర తన అత్తింటివారికి ఫోన్ చేశాడు. అక్కడకు రాలేదని వారు చెప్పడంతో ఆమె కోసం చుట్టుపక్కల గాలించారు. జాడ తెలియకపోవంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన చిన్నయ్య

మనుబోలు, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనుబోలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధు డికి తీవ్ర గాయాలయ్యాయి. కోదండ రామపురం దళితవాడకు చెందిన కొం డేటి చిన్నయ్య అనే వృద్ధుడు కూలి చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేం దుకు రోడ్డు దాటుతుండగా, నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళుతున్న మోటార్‌సైకిల్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో చిన్నయ్య కుడికాలు విరిగింది. తలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

కావలి రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మంగళవారం మృతి చెందింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం రామచంద్రాపుంకు చెందిన కోసూరు తిరుపతమ్మ(55) ఈనెల 24వ తేదీన గ్రామంలోని దుకాణానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన కొమ్మన శివకుమార్ మోటారు బైక్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి తిరుపతమ్మను ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు అక్కడ నుంచి చెన్నెకు తరలించారు. తిరిగి ఈనెల 26వ తేదీన చెన్నై నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో తల్లిదండ్రులపై దాడి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తల్లిదండ్రులపై తనయుడు దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి కావలి పట్టణం ముసునూరు అరుంధతీయవాడలో జరిగింది. బాధితుల వివరాల మేరకు... పోతిపోగు ఈసాకు, కొండమ్మ వృద్ధ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కొండయ్య. బేల్దారి పనులకు వెళ్లేవాడు. సంపాదించిన డబ్బులు భార్య శాంతమ్మకు ఇవ్వకుండా మద్యం తాగి వచ్చేవాడు. ఈ క్రమంలో భార్య శాంతమ్మతో గొడవపడి కొడుతుండగా పక్కనే మరో ఇంట్లో వేరుగా నివశించే తల్లిదండ్రులు ఈసాకు, కొండమ్మలు అడ్డుపడ్డారు. దీంతో వారిపై దాడి చేయడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని బంధువులు ఏరియా వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510

కావలిలో 10 రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ఉత్తర శివార్లలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు పనులు జరుగుతున్నాయని కావలి ఒకటో పట్టణ విద్యుత్ ఏఈ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 27 నుంచి 10 రోజుల పాటు దాని పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతందని తెలిపారు. మద్దూరుపాడు సబ్‌స్టేషన్ నుంచి ట్రంకురోడ్డులోని నమస్కార్ హోటల్ వరకు, పాతూరులోని కృష్ణుడి బొమ్మ సెంటర్ పరిసరాలు, నేమ్స్ స్కూల్ పరిసరాలు, గీతాంజలీ అపార్ట్‌మెంట్ ప్రాంతం, నలందస్కూల్ పరిసర ప్రాంతం, మసీద్‌సెంటర్ దాని పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ఆ ప్రాంతవాసులు ఈ అంతరాయానికి సహకరించాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు తెట్టు గంధమహోత్సవం

గుడ్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టులో సయ్యద్‌సుల్తాన్ బీబీ దర్గా గంధమహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

2 నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరం

బిట్రగుంట, మే 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలో ఆధార్ కార్డు లేని గిరిజనుల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు లేని గిరిజనులను గుర్తించి ఆయా పంచాయతీల కార్యదర్శులు వారికి ఆధార్ నమోదు చేయించాలని పేర్కొన్నారు.

117 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 525 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 408 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-85, ఆర్‌ఆర్-13, సీఆర్-18, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 117 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.242.02గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్స్వరన్‌దత్ తెలిపారు.

సీపీఎం సమైక్యత యాత్ర

జలదంకి, మే 27(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జలదంకిలో సమైక్యత యాత్ర నిర్వహించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం అంటూ అమెరికాకు లొంగిన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైఖరిని నిరసిస్తూ సీపీఎం కార్యాలయం నుంచి గట్టుపల్లి రోడ్డు, ఎస్సీకాలనీ కేంద్రంగా బస్టాండు కూడలి వరకు యాత్ర కొనసాగింది. ప్రదాని నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు లొంగడం సిగ్గుచేటని, దేశంలో ప్రజలందరూ కులమతాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండి దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని నాయకులు కోరారు. పెహల్గాం ఘటన తరువాత మోదీ పాకిస్తాన్ మీద నాలుగు రోజులు ధూందాం అని ఆఖరికి ఉగ్రవాదులను పట్టుకోకుండా మేము యుద్ధం చేశామని ప్రగల్భాలు పలికారని పేర్కొన్నారు. పెహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన సందర్శకులకు జోహార్లు తెలిపారు. ఈ యాత్రలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, రాధాకృష్ణ, మేలంగి ఆంథోనీబాబు, నరసింహ, బాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలను తొలగించండి

అల్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, పురిణి ఆయకట్టు పరిధిలోని 4500 ఎకరాలకు సాగునీటిని అందించే 800 ఎకరాల పురిణి చెరువులో ఆక్రమణలను తొలగించి సాగునీటిని పుష్కలంగా అందించాలంటూ ఆ ప్రాంత రైతులు కలెక్టరు ఆనంద్‌కు విన్నవించారు. మంగళవారం అల్లూరుకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 800 ఎకరాలు ఉండాల్సిన చెరువు విస్తీర్ణం కేవలం 50 నుంచి 100 ఎకరాలకు తగ్గిపోయిందని, ఈ కారణంగా సాగునీరు కేవలం పారుదలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ ఒక్కసారిగా ఆక్రమణలను తొలగించే వీలు లేదని, ప్రతి భూమికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఇరిగేషన్ ఏఈలను ఆదేశించారు.

ఐదుగురు విద్యార్థులకు ఆర్థిక సాయం

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి) : మనరెడ్డి ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాలో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద రెడ్డి విద్యార్థులు 5 మందికి ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు ఆ ఫౌండేషన్ సభ్యులు బత్తిన ప్రభాకర్‌రెడ్డి, కూరపాటి వెంకటకృష్ణారెడ్డి, చిన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు పట్టణంలో వారికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి 5 మందిని ఎంపిక చేసి రాబోయే విద్యా సంవత్సరానికి ఆర్థికసహాయం అందచేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9390844319ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వాట్సప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలు...

యమపాశాలు!

- శిథిలమై కూలుతున్నవైనం
- భయాందోళనలో పట్టణ వాసులు
- కాలనీల్లో కర్రలే విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ముసునూరు ఇందిరమ్మ కాలనీలో కర్రలకు కట్టిన విద్యుత్ తీగలు

కావలి రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో నివాసాల మధ్యన, ప్రధాన రోడ్లకు పక్కన కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు ప్రజల పట్ల యమపాశాలుగా మారాయి. శిథిలమైన స్తంభాలు కూలి ప్రజల ప్రాణాలు తీస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో బద్దలుగా చీలి కూలేందుకు సిద్ధంగా ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం పక్కన సుమారు 2 ఏళ్ల క్రితం మరో స్తంభం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు దానికి విద్యుత్ వైర్లు మార్చకుండా వదిలేశారు. దీంతో దెబ్బతిన్న ఆ స్తంభం తీగల మోపున వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. దీంతో ఆ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ నెల 19వ తేదీ తెల్లవారు జామున వాయునందనప్రెస్ వీధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం నడిరోడ్డుపై ఇరిగిపడి తీగల మోపున వేలాడింది. ఈ స్తంభం దెబ్బతిన్న విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని స్థానికుల వాపోయారు. అలాగే పాత శివాలయం రోడ్డులోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా మురుగునీటి కాలువ అంచున ఉన్న 11కేవీ లైన్ ఇనుప విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి సపోర్టు తీగ మోపున ఉంది. నిత్యం ఆలయాలకు వచ్చే భక్తులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో రద్దీగా ఉండే ఆ మార్గంలో ఎప్పుడు స్తంభం విరిగి మీద పడుతుందోనని భయంతో ఆందోళన చెందుతున్నారు. ముసునూరులోని దివ్యాంగుల కాలనీలో ఈనెల 4వ తేదీన విద్యుత్ స్తంభం విరగటంతో ఆ స్తంభాన్ని ఇంటి గోడకు కట్టి పెట్టారు.

దెబ్బతిన్న స్తంభాలను మార్పిస్తాం

మా దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నాం. పట్టణంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వెంటనే మార్పిస్తాం. అలాగే విద్యుత్ స్తంభాలు లేని విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయిస్తాం.

- బెనర్జీ, విద్యుత్ శాఖ ఈఈ, కావలి

అలాగే ఈనెల 20వ తేదీన పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని వైన్ షాపు ఎదురు విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సపోర్టు స్తంభం కూలి తల మీద పడటంతో మద్దెల వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా పట్టణంలోని కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు అనేకం దర్శనమిస్తున్నాయి. అలాగే ముసునూరు ఇందిరమ్మ కాలనీలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్రలు నాటి వాటికి విద్యుత్ తీగలు కట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం వచ్చినప్పుడు కర్రలు పడిపోతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాల బారిన పడాల్సివస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిని ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయన్న విషయాన్ని అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని, చిన్నపాటి గాలులు వీచినా భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పట్టణ వాసుల కోరుతున్నారు.





పాత శివాలయం రోడ్డులో పునాది కదిలిపోయి ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం, వాయునందన ప్రెస్ వీధిలో రెండుగా చీలిన 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



టీడీపీ మహానాడుకు తరలివెళ్తున్న కందుకూరు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు కందుకూరు నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సారథ్యంలో వివిధ మండలాల కమిటీల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, పార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలలో వివిధ బాధ్యతల్లో పనిచేస్తున్న ముఖ్యనాయకులు ప్రత్యేక వాహనాల్లో పసుపు పండుగకు బయలుదేరి వెళ్లారు. వీరితోపాటు పలు గ్రామాల ముఖ్యనేతలు, పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్న పలువురు కార్యకర్తలు ఉత్సాహంగా పసుపు చొక్కాలు, కండువాలు ధరించి తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి అందరూ ఒకేసారి ర్యాలీగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

● నేడు ఎన్టీఆర్ జయంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహిస్తున్న అన్న ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహానాడులో అల్లూరు నాయకులు

అల్లూరు : కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం మహానాడుకు మండలంలోని కీలక నాయకులు తరలివెళ్లారు. నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో వీరంతా మహానాడులో పాల్గొని పార్టీ సిద్ధాంతాలను తెలుసుకున్నారు. పాల్గొన్నవారిలో నెల్లూరు పార్లమెంటు కోశాధికారి పలగాటి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రేబాల శంకర్ రెడ్డితోపాటు మండల స్థాయి నాయకులు మేడా కృష్ణారెడ్డి, తోట శ్రీహరి, సామంతుల పరంధామరెడ్డి, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు తరలి వెళ్లారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కందుకూరు : కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్, తదితరులు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రభావతి కోరారు. మండలంలోని పందలపాడులో కిశోరివికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైబర్ నేరాలు - దైనందిన జీవితంలో యోగా ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌నేరాలు విరివిగా జరుగుతున్నాయని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని తెలిపారు. మీ ఆధార్, పాన్ నెంబర్లను ఎలాంటి యాప్‌లలో అప్‌లోడ్ చేయకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, సైబర్ నేరాల కారణంగా సామాన్య ప్రజలు కోట్లాది రూపాయలు నష్టపోతున్న పరిస్థితులు ఉన్నందున మహిళలు వీటిపట్ల సంపూర్ణ అవగాహనతో తమ బిడ్డలను కూడా ఈనేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవటం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవనం గడపాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళాపోలీసు గుండ్ల గిరిజ, వరల్డ్‌విజన్ మేనేజరు యేసయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కిశోరి వికాసంతో సమాజాభివృద్ధి

వలేటివారిపాలెం : కిశోర బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు కందుకూరు సీడీపీవో శర్మిష్ట తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్యవివాహాలు నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ప్రసన్న, కార్యకర్తలు చంద్రకళ, శిరీషా, బాలికలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



సమావేశంలో సమీక్షిస్తున్న అధికారులు

కావలిరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. తాగునీరు, పారిశుధ్యం, ఉపాధిహామీ పథకం తదితర అంశాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్సీపాలెం, ఆనెమడుగు, సర్వాయపాలెం పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉపయోగంలో లేవని మిగిలిన చోట్ల చెత్త సేకరణ జరుగుతుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చెత్తతో సంపద కేంద్రాలు మరమ్మతులు చేయించాలని సర్పంచులను కోరారు. గ్రామాల్లో రోడ్ల సైడు పేడదిబ్బల తొలగింపునకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. గతంలో నిధులు ఖర్చు చేశారు గాని చేసిన అభివృద్ధి మాత్రం కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పామంజి రాజయ్య, అరగల కవిత, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలను సందర్శించిన ప్రతినిధులు వేలంలో దక్కుతున్న ధరలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు మాట్లాడుతూ పొగాకు అమ్ముకోవడం తలకుమించిన భారంగా మారిందని, ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పొగాకు పండించగా ఈ ఏడాది ధరలు చూస్తుంటే పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పేరుకే గరిష్ఠ ధరగా క్వింటం రూ.28వేలు చూయిస్తూ నాణ్యమైన పొగాకును కూడా రూ.20వేలకు కొనకుండా రైతులను వ్యాపారులు నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు వర్ధినేని సిద్ధయ్య, ఎస్ఏ గౌస్, జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల కోసం 2న సీపీఐ నిరసన



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): నివేశన స్థలాలు లేని పేదలందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూన్ 2న కందుకూరులో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిరసన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయటంలో విఫలమైందని, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ అమలుకు ఎలాంటి కార్యాచరణ లేదని విమర్శించారు. మరోపక్క గృహ నిర్మాణాలకు సంబంధించి మెటీరియల్ ధరలు విపరీతంగా పెరగటంతో ప్రభుత్వం ఇస్తున్న అరకొర సహకారం చాలక పేదలు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల గృహనిర్మాణం కోసం కనీసం రూ. 5లక్షలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.సురేష్‌బాబు, కే.మురళీ, వై.ఆనంద్‌మోహన్, లక్ష్మీనారాయణ, ఉప్పుటూరి మాధవరావు, సీహెచ్ దుర్గాప్రసాద్, పీ. కోటేశ్వరరావు, యనమల కొండయ్య, బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలి



మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో మురళీధర్‌రావు

కొండాపురం, మే 27(ఆంధ్ర జ్యోతి): ఉపాధి కూలీలు 4 గంటల సమయం తోపాటు ఖచ్చితమైన కొలతల ప్రకారం పనులు చేయాలని ఉపాధిహామీ ఏపీవో మురళీధరరావు అన్నారు. మంగళవారం మండలంలోని భీమవరప్పాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లలో నమోదైన కూలీలు అక్కడ ఉన్న కూలీల సంఖ్య సరిపోయిందన్నారు. వేసవి కాలం కావడంతో పనులు జరిగే ప్రదేశానికి ప్రతి ఒక్కరూ తాగునీరు తీసుకు రావాలని కూలీలకు సూచించారు. గ్రామం నుంచి పని జరిగే ప్రదేశం 5 కిలో మీటర్లపైన ఉంటే రవాణాకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. ఖచ్చితమైన కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు ఒక్క కూలీకి రూ.307 నగదు వారి ఖాతాకు ప్రభుత్వం జమచేస్తుందన్నారు.

యోగాంధ్రకు సన్నద్ధం



కావలి : యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, సిబ్బంది

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కావలి పట్టణంలోని ఎంపీ ట్రంకురోడ్డులో ఉన్న ఐకాన్ సెంటర్ వద్ద మున్సిపల్ అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేసి సన్నద్ధ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యోగా ట్రైనర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ యోగాలో దాని యొక్క ఉపయోగాలను గురించి వివరించారు. అనంతరం అందరికీ అవసరమైన యోగాసనాలను గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, ఆర్వో ఫణీంద్ర, టీపీవో వివేకానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

● **అల్లూరు** : అల్లూరు-1,2,3 సచివాలయాల్లో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగర పంచాయతీ ఈడీవో వరప్రసాద్ స్థానికుల భాగస్వామ్యంతో యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పెనుగొండయ్య, సుజాత, సమత, మణికంఠ, ఉమా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : యోగాతో శారీరక మానసిక ప్రశాంతతో పాటు పలు రకాల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. యోగాపై గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఎక్కడెక్కడ యోగా కార్యక్రమాలు నిర్వహించేది ఒకటి రెండు రోజులలో తెలియజేస్తామన్నారు.

● **వలేటివారిపాలెం** : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ పొందిన వలేటివారిపాలెం, పోకూరు హైస్కూల్స్ పీడీలు ఐజాక్, వెంకటేశ్వర్లు, చుండి మోడల్‌స్కూల్ యోగా టీచర్ శ్రీలత శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో నరేంద్రదేవ్ మాట్లాడుతూ బుధవారం వలేటివారిపాలెం హైస్కూల్‌లో 200 మంది సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

30న మండలస్థాయి యోగా తరగతులు

ఉలవపాడు : అంతర్జాతీయ యోగా దినోవత్సవంలో భాగంగా ఈనెల 30వ తేదీన మండలంలో యోగా శిక్షణ తరగతులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయని ఎంపీడీవో ఎస్ విజయ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో యోగా నిర్వహిస్తారని తెలిపారు. వెలుగు సిబ్బంది, సీసీలు, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు మండల మహిళా సమాఖ్య సమావేశం మందిరంలో, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ఏంఈవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాసనాలలో ఉత్తమ ప్రతిభ చూపిన వాళ్లను జిల్లాస్థాయి యోగా శిక్షణ తరగతులకు ఎంపిక చేస్తామన్నారు.



అల్లూరు : ప్రజలకు యోగాసనాలు నేర్పుతున్న కార్యదర్శి వరప్రసాద్

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ఈసారి రోహిణిలో రోళ్లు పగలవ్!

- అకాల వర్షాలకు తోడు ముందే పలకరించిన నైరుతి
- ఫలితంగా తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు
- జిల్లాలో విచిత్ర వాతావరణం

రోహిణి కార్తె వేళ రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడి ఎన్నట్నుంచో ఉంది. ఈ కార్తె వస్తోందంటేనే జనం బెంబేలెత్తిపోయే పరిస్థితి ఉంటుంది. మామూలుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే, ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఉండే ఎండలు మరీ అదరగొడతాయి. మే 25 నుంచి ఈ రోహిణి కార్తె ప్రవేశించింది. వాస్తవానికి రోహిణి కార్తె రోజుల్లో ఉష్ణోగ్రతలు 42-46 డిగ్రీల మధ్య నమోదవుతాయి. దీంతో వడగాల్పులు, తీవ్ర వడగాల్పులు ఉంటాయి. ఈ ఏడాది అకాల వర్షాలు, అల్పపీడనం కారణంగా వేసవికాలం.. వర్షాకాలంగా మారింది. ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటున్నాయి. ఈ వర్షాల పరంపర జూన్ వరకు కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈసారి ఈ రోహిణి కార్తె ప్రభావం జిల్లాలో లేనట్టే.

ఈ ఏడాది ఆదివారం ప్రారంభమైన రోహిణి కార్తె జూన్ 15 వరకు ఉంటుంది. ఈ కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు.. రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడి గాలులు వీస్తాయి. ఇక, మే నెలలో పగటి వేళల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచీ 44 డిగ్రీల దాకా చేరడం సాధారణం. అయితే ఈనెల ద్వితీయార్ధం నుంచీ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు కూడా దాటడం లేదు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అకాల వర్షాలు సంభవిస్తున్నాయి. మోస్తరు వాన నుంచీ భారీ వర్షాల దాకా కురుస్తున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఎండ తగ్గినా కొంత మేరకు ఉక్కపోత నెలకొంటున్నా మొత్తం మీద చూస్తే ఉష్ణోగ్రతలు తగ్గాయి. సోమవారం అత్యల్ప ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలు, అత్యధిక ఉష్ణోగ్రత 37.1 డిగ్రీలు నమోదు కాగా గతేడాది మే నెలలో ఇదే రోజున అత్యల్పంగా 30.1 డిగ్రీలు, అత్యధికంగా 38.6 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఉష్ణోగ్రతలు తగ్గడం గమనార్హం.

సాధారణాన్ని మించిన వర్షపాతం

సాధారణ వర్షపాతం 47.5 మిల్లీమీటర్లు కాగా.. ఈనెలలో సోమవారం నాటికి 73.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే.. సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. దీనికితోడు నైరుతి రుతుపవనాలు వారం రోజులు ముందుగానే ప్రభావం చూపుతున్న సంగతి తెలిసిందే. నైరుతి రుతుపవనాల ముందస్తు రాక కూడా జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమవుతోంది. ఇవన్నీ కలిపి ఈ వేసవిలో జిల్లాపై రోహిణి కార్తె ప్రభావాన్ని తగ్గించాయి. రుతుపవనాల ముందస్తు రాకతో జూన్ నుంచీ మొదలు కానున్న ఖరీఫ్ సీజను పంటల సాగుకు సానుకూలం అవుతుందన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అన్ని సంక్షేమ పథకాలకు కేంద్ర బిందువు బియ్యం కార్డు. అర్హులై కార్డుల్లేనివారు, మార్పులు చేర్పులు చేసుకోవడానికి పదేళ్లుగా ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో 21 రోజుల వ్యవధి లోనే లబ్దిదారులు, కార్డుదారుల నుంచి దాదాపు 29,657 దరఖాస్తులు అందాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

21 రోజులు.. 29,657 వినతులు

● కొత్త రేషన్ కార్డులు.. మార్పులు, చేర్పులకు దరఖాస్తుల వెల్లువ

కూటమి అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లేని వారికి కొత్తవి అందించేందుకు శ్రీకారం చుట్టింది. గత పదేళ్లుగా కొత్త కార్డులు మంజూరు లేకపోవడంతో ఇప్పటి వరకు నిరీక్షిస్తున్న వారికి శుభవార్త చెబుతూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజుటి నుంచి కొత్త కార్డుల కోసం.. ఉన్న వాటిలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి దరఖాస్తులతో మీ-సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలకు లబ్ధిదారులు పరుగులు పెడుతున్నారు. దరఖాస్తు ప్రక్రియలో 10 రోజులుగా సర్వర్లు మొరాయించాయి. ప్రస్తుతం సర్వర్ల పనితీరు కొంత మెరుగు పడడంతో దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసి వస్తున్నారు. ప్రధానంగా గతంలో చేసిన హౌస్ హోల్డ్ ఆధారంగా దరఖాస్తులను సంబంధిత సచివాలయాల్లో స్వీకరిస్తున్నారు. గత 21 రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా దాదాపు 29,657 దరఖాస్తులు అందాయి.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

మొదట కొత్త కార్డులు, మార్పులు, చేర్పుల కోసం సచివాలయాలకు వెళ్లిన తర్వాత డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో నమోదు చేస్తారు. అక్కడ నుంచి వీఆర్‌వోల లాగిన్‌కు పంపుతారు. అక్కడ పూర్తి వివరాలు పరిశీలిస్తారు. ఈకేవైసీ పూర్తి చేశారా లేదా అనేది ధ్రువీకరించాక సంబంధిత తహసిల్దార్ల లాగిన్‌కు పంపుతారు. అక్కడ నిబంధనల ప్రకారం ఆమోదం తెలిపిన తర్వాత అర్జీదారులకు రేషన్ కార్డు నెంబరుతో సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా కార్డుల విభజనకు సంబంధించి వచ్చాయి. ఇక, గత వైసీపీ ప్రభుత్వం బియ్యం కార్డులపై జగన్ బొమ్మను ముద్రించింది. తాజాగా ప్రభుత్వం లోగో ఉన్న స్మార్ట్ కార్డుల జారీకి చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి జూన్ నెలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ బియ్యం కార్డులు పంపిణీ చేయనున్నారు.



విభాగాల వారీగా వచ్చిన దరఖాస్తులు

కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు	4222
అడ్రస్ మార్పులు	1217
కార్డుల విభజన కోసం	2308
సభ్యుల చేరిక	20,870
కార్డులు సరెండర్ చేసినవి	25
సభ్యుల తొలగింపు	684
ఆధార్ సవరణ	330
మొత్తం దరఖాస్తులు	29,657

ఇది నిరంతర ప్రక్రియ

కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేయడం, కార్డుల్లో మార్పులు, చేర్పులనేవి నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కొత్తగా వివాహమైన జంటలు అప్పటికప్పుడు దరఖాస్తు చేసి కార్డులు పొందవచ్చు. కొత్త కార్డుల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన పని లేదు. దరఖాస్తు చేసిన వారం, 10 రోజుల్లో కార్డులు ఇంటికి వస్తాయి.

- శేషాచలం రాజు, డీఎస్‌వో




'యోగాంధ్ర'లో భాగస్వాములు కండి

తిరుపతి, మే 27 (ఆంధ్రజ్యోతి): 'భారతీయుల సనాతన సంపదైన యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలి' అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా మంగళవారం తిరుపతిలోని పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని జూన్ 15న 5వేల మందితో తిరుమలలో నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి మండలానికి నలుగురు శిక్షకులను ఏర్పాటు చేసి.. 200 మందికి చొప్పున శిక్షణ, అందరికీ యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 లక్షల మంది యోగాలో ప్రావీణ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహాచారి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు హోం స్టేల లైసెన్సుల రద్దుకు అనుమతి ఇవ్వండి

● వ్యభిచారం నిర్వహిస్తుండటంతో చర్యలకు పోలీసుల ప్రతిపాదనలు

తిరుపతి (నేరవిభాగం), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యభిచార గృహాలుగా వాడుతున్న రెండు హోం స్టేల లైసెన్సులు రద్దు చేసి, సీజ్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆర్డీవోకు అలిపిరి సీఐ రాంకిషోర్ లేఖ రాశారు. ఇందులో దుర్గా హోం స్టేలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్వాహకుడు వెంకటేష్‌తో పాటు రమణయ్యను మంగళవారం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి రిమాండ్‌కు విధించారు. అలాగే గతేడాది నవంబరులో ఇదే తరహాలో సెవెన్ హిల్ హోం స్టేలో వ్యభిచార కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. దీనిపై నిర్వాహకులను అరెస్టు చేశారు. ఈ రెండు హోం స్టేల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు శాశ్వతంగా సీజ్ చేయడానికి ఆర్డీవో రామ్మోహన్‌రావుకు ప్రతిపాదనలు పంపారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైనా అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రాం కిషోర్ విజ్ఞప్తి చేశారు.



గంగమ్మకు కరెన్సీ కళ

తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మకు కరెన్సీ కళ వచ్చింది. జాతర ముగిసిన తర్వాత రెండో మంగళవారం మరు పొంగళ్ల కార్యక్రమం సందర్భంగా అమ్మవారిని, సన్నిధిలోనూ 500, 200, 100, 50, 20, 10 రూపాయల నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి







చంద్రబాబుకు కండువా కప్పుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ - చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ - తన అనుచరులతో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ - కార్యకర్తల సంక్షేమంపై తీర్మానం ప్రవేశపెడుతున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు.. బలపరుస్తున్న తిరుపతి రూరల్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి

మహానాడులో నేతల సందడి



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



వేదికపై తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, చిత్తూరు, తిరుపతి టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్, నరసింహ యాదవ్



శ్రీకాళహస్తి సోషల్ మీడియా కార్యకర్త శశి ప్రసంగం





అనుచరులతో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ - లోకేశ్‌తో సత్యవేడు పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు - మంత్రి నారా లోకేశ్‌తో పులివర్తి వినీల్ కరచాలనం

తిరుపతి, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తొలిరోజు చిత్తూరు,తిరుపతి జిల్లాల నేతలు కీలక పాత్ర పోషించారు. మహానాడు ప్రాంగణంలోకి చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతినిధుల పేర్లు నమోదు చేసుకునే స్టాల్ వద్దకు రాగానే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఆయన పేరు నమోదు చేయించి మహానాడు కిట్ అందజేశారు. మహానాడులో పార్టీకి తన వంతుగా రూ. 10,00,116 విరాళం అందజేశారు.శాప్ ఛైర్మన్ రవి నాయుడు కార్యకర్తల సంక్షేమం అనే అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర రెడ్డి ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా విభాగం యాక్టివిస్టు శశి 'మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం' అంశంపై తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం దక్కించుకున్నారు. ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. చంద్రబాబు, నారా లోకేశ్ ఆయన్ను అభినందించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తనయుడు వినీల్ యువనేత నారా లోకేశ్‌తో పాటు పరిటాల శ్రీరామ్, భూమా జగద్విఖ్యాత్‌రెడ్డి తదితరులతో సన్నిహితంగా మసలుతూ ప్రాంగణంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ కనిపించారు.తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలపగా హోం మంత్రి అనిత, నందమూరి సుహాసిని తదితరులతో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు విజయశ్రీ సన్నిహితంగా గడిపారు. తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీ సభ్యులుగా బిజీబిజీగా పనిచేస్తూ కనిపించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, పంతగాని నరసింహ ప్రసాద్, అన్నమయ్య జిల్లా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, పులివర్తి వినీల్, శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇంఛార్జి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్, పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు తదితరులు మహానాడు కమిటీల్లో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ బిజీగా కనిపించారు.



బాటగంగమ్మ

తిరుమలలో బాటగంగమ్మ జాతర



విశేష అలంకరణలో అమ్మవారి ఆలయం

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుమల బాటగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. పాపవినాశనం నడక మార్గంలోని బాటగంగమ్మ ఆలయంలో ఏటా స్థానికులు జాతర నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాన్ని పుష్ప, ఫల, విద్యుత్ లైట్లతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ అమ్మవారి నేత్ర దర్శనం జరిగింది. తర్వాత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అలంకార దర్శనాలు మొదలయ్యాయి. జాతర సందర్భంగా తిరుమలతో పాటు తిరుపతి స్థానికులు బాటగంగమ్మను దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.



భక్తులకు అన్నదానం

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,542

తలనీలాలు సమర్పించినవారు: 34,265





జస్టిస్ ఇందిరేష్ - దిల్ రాజు దంపతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, సినీ నిర్మాత దిల్‌రాజు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కర్ణాటక మంత్రి శివరాజ్ ఉన్నారు. ఆలయం ముందు నిర్మాత దిల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ మంచి దర్శన ఏర్పాట్లు చేస్తోందని, స్వామి ప్రసాదాలు చాలా బాగుంటున్నాయన్నారు.

నలుగురు దళారులకు కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): దర్శనాల పేరుతో భక్తులను మోసగించే నలుగురు దళారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ముక్కంటి ఆలయ పరిసరాల్లో భక్తులను మోసగించే దళారులపై సీఐ ప్రత్యేకంగా మంగళవారం నిఘా పెట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులు భక్తులకు మాయమాటలు చెప్పి దర్శనాలు చేయిస్తామని నమ్మిస్తుండగా సీఐ వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.



పోలీసుల అదుపులో దళారీలు

భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుట, పాకాల, తిరుపతి టౌన్‌కు సంబంధించి రైల్వే ప్రాజెక్టుపనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. ఇక జాతీయ హైవేలు తిరుపతి-తిరుత్తణి, సి.మల్లవరం-రేణిగుంట, నాయుడుపేట-తిరుపతి, పీలేరు-కలూరు, రేణిగుంట-కడప లైన్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐటీ జోనల్ మేనేజరు విజయ భరత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ సురేంద్రనాయుడు, నేషనల్ హైవే పీడీలు రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీరు ప్రతిభ సాధించి.. విద్యార్థులకు నేర్పించాలి

- ఉమ్మడి జిల్లా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు డీఈవో సూచన
- డీఆర్పీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో ప్రతిభ సాధించి.. వారికి నేర్పించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు (డీఆర్‌పీ) డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. డీఆర్పీలకు ఆరు రోజులపాటు జరిగే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై శిక్షణ తరగతులను మంగళవారం తిరుపతిలో డీఈవో ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు భాష, గణితంపై పట్టు కలిగేలా ఆటపాటలతో ఆసక్తికరంగా బోధించాలన్నారు. అటువంటి నైపుణ్యాలను డీఆర్‌పీల్లో కలిగించేందుకే ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ బోధన నైపుణ్యాలను పెంపొందించుకుని మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ.. రాయడం, చదవడం వంటి కనీస అభ్యసన స్థాయిలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు డీఆర్పీల నుంచి ఉపాధ్యాయుల వరకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో తిరుపతి జిల్లా నుంచి 102 మంది, చిత్తూరు జిల్లా నుంచి 93 మంది డీఆర్పీలకు 16 మంది కేఆర్పీలు శిక్షణ ఇస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, స్టేట్ ప్రథం కోఆర్డినేటర్ కన్నయ్యనాయుడు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ఏఎంవో సుభాషిణి, తిరుపతి జిల్లా సమగ్రశిక్ష అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రోన్‌కు చిక్కారిలా..

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలో సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్ నిర్వహించారు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దామినేడు పరిధిలో అటుగా వెళుతున్న వాహనాలను కొందరు హిజ్రాలు ఆపి ఇబ్బంది పెడుతున్న దృశ్యాలను డ్రోన్ కెమెరాలతో గుర్తించారు. అక్కడికి పోలీసులు చేరుకుని ప్రశ్నించారు. ఇక్కడకు ఊరికే వచ్చామని వారు సమాధానం చెప్పారు. రాత్రి సమయాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉండకూడదని హెచ్చరించి పంపారు. వాహనదారులు, ప్రజలను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. అలిపిరి పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, జూదం ఆడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.



ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 13 కిలోల గంజాయి స్వాధీనం

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అరెస్టు చూపారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ... ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టణ శివార్లలోని చెన్నై రహదారిపై గంజాయి రవాణా సాగుతున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారన్నారు. తమిళనాడుకు చెందిన మురళి, శ్యామ్‌రాజ్, సంజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో గంజాయిని తమిళనాడుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోని శ్రీకాళహస్తి వద్ద దాడి చేశామన్నారు. మురళి, శ్యామ్‌రాజ్, సంజయకుమార్ 13 కిలోల గంజాయితో పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ పార్థసారథి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నందకుమార్, రేగాన్‌ను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శుభ్రత పాటించి బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వీసీ ద్వారా జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బస్‌స్టేషన్‌లో పరిసరాలను ఎప్పటికపుడు శుభ్రం చేసి మరుగుదొడ్ల నిర్వహణ బాగుండలన్నారు. బస్సులు అన్ని కండిషన్లలో ఉండేలా ఎప్పటికపుడు మరమ్మతులు చేపట్టాల్నారు. బస్‌స్టేషన్ ఆవరణలోని దుకాణాల్లో నిర్ణీత ధరలకే వస్తువులను అమ్మాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వెంకట్రావు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- హైవే దాటుతున్న వారిని ఢీకొన్న లారీ
- తల్లీ కూతుళ్ల దుర్మరణం, మరో ఇద్దరికి గాయాలు
- గుడ్లూరు మండలం మోచర్ల వద్ద ఘోరం

గుడ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : బంధువులతో కలిసి తమ ఇష్టదైవమైన పోలేరమ్మను దర్శించుకున్నారు. ఎంతో ఆనందంతో తిరిగి ఇంటికి వెళుతున్న వారిని ఓ లారీ మృత్యువులా దూసుకొచ్చింది. వేగంగా వచ్చి ఢీకొనడంతో తల్లీకూతుళ్లు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. గుడ్లూరు మండలం మోచర్ల వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆ గ్రామస్థుల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది.

గుడ్లూరు మండలం మోచర్ల బీసీ కాలనీకి చెందిన గడ్డేటి రమాదేవి (46), ఈమె కుమార్తె దాసరి మమత (30) బంధువులతో కలిసి మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని జాతీయ రహదారికి అవతల వైపు ఉన్న పోలేరమ్మను దర్శించుకున్నారు. తిరిగి 11 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో కావలి నుంచి ఒంగోలు వైపు వెళుతున్న (ఏపీ39 యూఎఫ్8499) 16 చక్రాల లారీ వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. లారీ చక్రాల కింద రమాదేవి, మమత పడి మాంసపు ముద్దలా మారిపోయారు. అలాగే, మృతుల బంధువులైన వెంకటరమణమ్మ, వైష్ణవిలకు కూడా గాయాలు కావడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. తల్లీకూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, మృతులో దాసరి మమతకు భర్త, ఇద్దరు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘోర ప్రమాదంతో మోచర్ల గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతులు మమత, రమాదేవి


యానాదుల కోసం ప్రత్యేక సహకార సంఘం

- రాష్ట్రంలోనే మొదటగా రాపూరులో ఏర్పాటు
- వెయ్యి మందికి సభ్యత్వం
- జిల్లా సహకార అధికారి గురప్ప



గిరిజన సహకార సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డీసీవో గురప్ప

నెల్లూరు (హరనాథపురం), మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాపూరులో యానాదుల కోసం రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సహకార సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప చెప్పారు. మంగళవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో రాపూరుకు చెందిన యానాది వర్గ సభ్యులకు సహకార సంఘం రిజిస్ట్రేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాచీన గిరిజన తెగకు చెందిన యానాది కుటుంబాలను సమీకృతం చేసి, వారి జీవనోపాధులను మెరుగుపరచడానికి రాపూరులో షెడ్యూల్ తెగల వన్ ధన్ వికాస్ కేంద్ర పరస్పర సహాయక సహకార సంఘం రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. రాపూరు మండల పరిధిలోని వెలిగొండ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు వెయ్యి మంది యానాదులను సంఘంలో సభ్యులుగా చేర్పిస్తామన్నారు. వారికి వెలిగొండ అటవీ ప్రాంతంలోనే కలపేతర అటవీ ఫల సాయం, ముడి సరుకుల ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి మార్కెటింగ్ సౌకర్యం, ఆర్థిక సాధికారత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాపూరు సబ్ డివిజన్ సహకార శాఖ అధికారి వీ రవికుమార్, డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



సంచార వైద్యం.. పశువులకు దూరం

సంచార వైద్యం పశువులకు అందనంటోంది. రైతుల చెంతకే పశువైద్యం పేరుతో గత ప్రభుత్వం ఆర్భాటంగా ఈ వాహనాలను తీసుకురాగా, ఏడాదికాలంగా వీటి సేవలు ఆగిపోయాయి. మర్రిపాడు, అనంతసాగరం మండలాల కోసం ఓ సంచార వాహనాన్ని (అంబులెన్స్) అందుబాటులోకి తెచ్చారు. అయితే, ఏడాది కాలంగా ఎప్పుడు ఎక్కడ ఉంటుందో? ఎప్పుడు మరమ్మతులకు గురై షెడ్డుకు చేరుతుందో అంతుపట్టడం లేదు. గడిచిన నెల రోజుల వ్యవధిలో నాలుగు సార్లు మరమ్మతుకు గురైనట్లు సమాచారం. తాజాగా మరోమారు మరమ్మతుకు గురైన వాహనాన్ని మరో వాహన సాయంతో తీసుకుళుతున్న దృశ్యం ఇది

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)




కూలీలను విచారిస్తున్న పోలీసులు

'అగ్రిగోల్డ్' భూముల్లో మళ్లీ పుష్పాలు!

- జామాయిల్ చెట్లపై గొడ్డళ్ల వేటు
- లారీల్లో కలపను తరలించే యత్నం
- సీఐడీ, పోలీసులకు గ్రామస్థుల సమాచారం
- ఆరు వాహనాలతోపాటు 48 మంది కూలీలు అదుపులోకి..

ఉదయగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ భూముల్లో దొంగలు పడ్డారు. వారి గొడ్డళ్ల వేటుకు ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు నేలకొరుగుతున్నాయి. అధికారమే అండగా మొన్న వరికుంటపాడు, కలిగిరి మండలాల్లో యథేచ్ఛగా జామాయిల్, ఎర్రచందనం, శ్రీగంధం చెట్లు నరికి సొమ్ము చేసుకున్నారు. తాజాగా మంగళవారం ఉదయగిరి మండలం తిరుమలాపురం పంచాయతీలో అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లపై పడ్డారు. తిరుమలాపురం పంచాయతీలో అగ్రిగోల్డ్ సంస్థకు సుమారు 70 ఎకరాల భూములు ఉండ గా, సుమారు ఒకటిన్నర దశాబ్దం క్రితం సంస్థ జామాయిల్ సాగు చేపట్టింది. ప్రస్తుతం ఆ చెట్లు బాగా ఊరడం, ధర ఆశాజనకంగా ఉండటంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. ఇంకేముంది. మంగళవారం తెల్లవారుజామునే 48 మంది కూలీలు, మూడు లారీలతో తోటల్లోకి చేరుకున్నారు. గంటల వ్యవధిలోనే ఐదెకరాల్లో జామాయిల్ నరికి లారీలకు లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇది గుర్తించిన గ్రామస్థులు, అగ్రిగోల్డ్ సిబ్బంది వెంటనే పోలీసు, సీఐడీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఉదయగిరి ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కూలీలను విచారించారు. మూడు లారీలు, మూడు ఆటోలను స్వాధీనం తీసుకున్నారు. అలాగే 48 మంది కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ వ్యవహారం వెనుక ఉన్న పుష్పా ఎవరో తెలియాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా అక్రమ జామాయిల్ నరికివేత వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులెవరో అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



కర్రతో రవాణాకు సిద్ధంగా ఉన్న లారీ

కాలువ స్థలం రక్షణకు చర్యలు

- హెచ్చరిక బోర్డులు పెట్టిన అధికారులు

నెల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రామిరెడ్డి కాలువ భూముల రక్షణకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'కాలువ భూముల కబ్జా' కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా స్పందించి కాలువ స్థలాల కబ్జాను అడ్డుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు ఆక్రమణకు గురైన రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డులు పాతారు. ఈ స్థలంలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. అలానే ఆ కాలువ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తుల వివరాలు కూడా సేకరించారు. ఆక్రమణదారులకు నోటీసులు పంపుతా మని ఇరిగేషన్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన ఇరిగేషన్ అధికారులు

కావలి ఆర్టీసీకి ఇంధన అవార్డు

కావలి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో అరుదైన అవార్డు దక్కిం చుకుంది. ఒక లీటరు డీజిల్‌కు 5.98 కి.మీ మైలేజ్ సాధించినందుకు ఆర్టీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇంధన సామర్థ్య అవార్డును అందజేశారు. ఈ మేరకు మంగళవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు పాల్గొని డిపో మేనేజరు శ్రీనివాసులుకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను కావలి డిపోకు నిర్దేశించిన ఇంధన పొదుపు లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కావలి డిపో జిల్లాలోని మిగతా డిపోలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజరు కల్పన, కేఎంపీఎల్ మెకానిక్ పాండురంగా రావు, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కావలి డీఎం శ్రీనివాసులుకు అవార్డు ఇస్తున్న జిల్లా ప్రజారవాణాధి కారి మురళీబాబు

సిలికా మైనింగ్‌కు అభ్యంతరం

పోలీసుల జోక్యంతో తరలింపు



కొండూరు వద్ద సిలికాను తరలించేందుకు వచ్చిన టిప్పర్లు

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామ సరిహద్దుల్లో ఇళ్ల స్థలాల పక్కన ఉన్న సిలికాను తరలించేందుకు మంగళవారం సాయంత్రం అధిక సంఖ్యలో టిప్పర్లు రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. తహసీల్దారు రామయ్య రెవెన్యూ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సర్వే నెంబర్లు 38, 40లో సుమారు 31 ఎకరాల్లో సిలికా తవ్వి తరలించుకునేందుకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. అలాగే 2023 నుంచి 2043 వరకు సిలికాను తవ్వి తరలించేందుకు అనుమతులు ఉన్నాయని మైనింగ్ ఏడీ శ్రీనివాసులు తెలిపారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని గ్రామస్తులను చెదరగొట్టి సిలికా తరలింపునకు మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా కొండూరు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో మైనింగ్ నిర్వహణతో పర్యావరణ ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని, భూగర్భజలాలు సైతం అడుగంటి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన చేపడతామని చెప్పారు.

చౌకదుకాణ డీలర్లు నిబంధనలు పాటించాలి



చౌక దుకాణదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు రాజేంద్ర, సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథరెడ్డి

నాయుడుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులను అందజేయాలని తహసీల్దారు రాజేంద్ర తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట పట్టణ, గ్రామీణ పరిధిలోని చౌక దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల్లోనే సరుకులు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అలాగే 65 ఏళ్ల నిండినవారికి ఇంటి వద్దకెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహిత విద్యాకేంద్రం ఏర్పాటుకు పరిశీలన



హెచ్‌ఎం మాధవీలక్ష్మితో చర్చిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధన అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం మాధవీలక్ష్మితో చర్చించారు. కార్యక్రమంలో హేమలత, అజయ్‌బాబు, మంగమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకులు అందించాలి



డీలర్లతో సమావేశమైన తహసీల్దారు శ్రీనివాసులు

దక్కిలి, మే 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులను కార్డుదారులకు పారదర్శకంగా అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి డీలర్లు రేషన్ షాపు వద్దే ఎలక్ట్రానిక్ కాటాతో తూకం వేసి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. అలాగే షాపు వద్ద ధరల పట్టిక విధిగా ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): కోట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి గూడూరు డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రాత్రిపూట గస్తీ గురించి వాకాడు సీఐ హుసేన్‌బాషాకు సూచనలు చేశారు. అదేవిధంగా కోట పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు సలహాలు ఇచ్చారు.

విష్ణునివాసంలో భక్తుల నగలు చోరీ

తిరుపతి(నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విష్ణునివాసంలో భక్తుల బంగారు నగలు చోరీ చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు....తెలంగాణ రాష్ట్రం కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి, ఆమె భర్త శ్రీధర్‌రావు ఈ నెల 15న తిరుమలకు వచ్చారు. అక్కడ నుంచి రెండు రోజుల తర్వాత తిరుపతికి వచ్చి విష్ణునివాసంలో గది తీసుకున్నారు. వారు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల తాళాలు పగులకొట్టి బ్యాగులో వుంచిన దాదాపు 16 గ్రాముల బంగారు నగలు చోరీచేశారు. మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యానగర్, చిటేడు, కోట గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఊహశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిల్వలు, ఎమ్మార్పీ తదితర అంశాలకు సంబంధించిన అంశాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకొంటామని అన్నారు. కార్యక్రమంలో వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించండి

పెళ్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని సహిత జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిగువచావాలి గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక విద్యతో పాటు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు.

యోగా సాధనతో మానసిక వికాసం

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో యోగాంధ్రలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం, సిద్ధించడంతో పాటు మానసిక వికాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన దినచర్యగా మార్చుకోవాలన్నారు.





వినియోగదారుడు కొన్ని వస్తువులను ప్లాస్టిక్ సంచిల్లో వేసి ఇస్తున్న దుకాణదారుడు - చెత్త కుండీ చుట్టూ ప్లాస్టిక్ వ్యర్థాలు

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

పాలిథిన్ కవర్లు, వ్యర్థాలతో పెరుగుతున్న అనర్థాలు ● పర్యావరణ పరిరక్షణకు తీవ్ర ముప్పు

సూళ్లూరుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ క్యారీ బ్యాగు లేనిదే ఏ వస్తువు కొనలేని, తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. మనిషి జీవితంలో పాలిథిన్ కవరు నిత్యావసర వస్తువుగా మారిపోయింది. సూళ్లూరుపేట పట్టణంలో విచ్చవిలడిగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. కూరగాయలు, చేపలు మార్కెట్, సూపర్ మార్కెట్స్, హోటల్స్, వైన్స్ షాపులు, దుకాణాల వద్ద పాలిథిన్ సంచుల వినియోగం విస్తారంగా పెరిగిపోయింది. పట్టణంలో ప్రతిరోజు దాదాపు 3 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలనే తలిస్తున్నారంటే తీవ్రతకు అద్దం పడుతోంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్లాస్టిక్ సంచుల్లో ఆహార వ్యర్థాలు, ఇతరత్రా పదార్థాలు నింపి బయటపడేస్తుండడంతో మూగజీవాలు తిని జీర్ణంకాక మృత్యువాత పడుతున్నాయి. పాలిథిన్ కవర్ల వల్ల కలుగుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2013 జూన్ 20న జీవో నెం.46 విడుదల చేసి.. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ సంచులు, రీ సైకిల్డ్ పాలిథిన్ బ్యాగ్స్, గ్లాసులు, కప్పులపై నిషేధం విధించింది. అయితే నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పంట కాలువలు, చెరువుల్లోకి చేరి నీరంతా కలుషితంగా మారుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పడేయడం వల్ల మురుగునీరు ప్రవహించడం లేదు. అధికారులు స్పందించి నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

యోగాంధ్ర శిక్షణ తరగతులు



కరబల్లవోలు సచివాలయంలో జ్యోతిప్రజ్వలన చేసి యోగా శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు

ఓజిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం యోగాంధ్ర శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 31వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగించేలా అధికారులు ఈ కార్యక్రమాలను రూపొందించారు. మంగళవారం ఓజిలి, కురుగొండ, వెంకటరెడ్డిపాళెం సచివాలయాల పరిధిలోని వారికి ఓజిలి స్త్రీశక్తి భవనంలో, చిల్లమానుచేను, ఆరిమేనిపాడు, ఇనుగుంట సచివాలయాల పరిధిలోని వారికి ఆరిమేనిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అత్తివరం, మాచవరం సచివాలయాల పరిధిలోని వారికి అత్తివరం ఉన్నత పాఠశాలలో, గ్రద్దగుంట, కరబల్లవోలు సచివాలయాల పరిధిలోని వారికి కరబల్లవోలు సచివాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఓజిలిలో తహసీల్దారు పద్మావతి, కరబల్లవోలు సచివాలయంలో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో-2 చంద్రశేఖర్, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్య, ఆయుర్వేద వైద్యురాలు మంజుల, యోగా శిక్షకులు, టీడీపీ నాయకులు నెల్లూరు సుబ్బారావు, మస్తాన్‌రెడ్డి, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని బాపూజీ కాలనీ, గాండ్లవీధి సచివాలయాల్లో మంగళవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహిం చారు. మాస్టర్ ట్రైనర్ల చేత యోగాపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై ప్రజలకు శిక్షణ

తడ, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాపై ప్రజలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొదటగా సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు యోగాపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలోని ప్రజలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే యోగాసనాలపై పోటీ పరీక్షలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనేవారు తమ పేర్లను ఆయా సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్, మస్తాన్, శేషారావు, శ్రీనివాసులు, ఎస్‌డీ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన



చిట్టేడు ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి యోగాంధ్రపై అవగాహన కల్పించారు. యోగా వల్ల ఉపయోగాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అదేవిధంగా చిట్టేడు ఉన్నత పాఠశాలలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు యోగా విశిష్టత గురించి అవగాహన కల్పించారు. అలాగే చిట్టేడు, కేశవరం, గూడలి-2, ఊనుగుంటపాళెం, సిద్దవరం సచివాలయాల్లో యోగాంధ్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, జీవన్, రేవతి, ఉపాధి సిబ్బంది, ఐసీడీఎస్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బైబిల్ శిక్షణ తరగతులు

చిల్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మంగళవారం పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలో బైబిల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. పాస్టర్ రాజేష్ బైబిల్ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో లలితమ్మ, దినకర్, ప్రవీణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



బోరు వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న ఎనిమిది గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే బోరు పాయింట్‌ను తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం ప్రారంభం తాగునీటి సమస్య పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ నాగజ్యోతి, సర్వేయర్ శకుంతల పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

తిరుపతి (నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఈస్ట్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు 10 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టుకు చెందిన గణపతి కొద్ది రోజులుగా తిరుపతిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం పక్కన పార్కింగ్ స్థలం వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిని చేసి అరెస్టు చేశారు.

నీట మునిగిన పంట పొలాలు

పెళ్లకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారం పేట రెవెన్యూ పరిధిలో రైతులు సాగుచేసిన సుమారు 20 ఎకరాల వరి పంట నీట మునిగింది. దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువుకు తెలుగుగంగ నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో రైతులు చెరువు కలుజుకు అడ్డు తొలిగించారు. దీంతో చెరువు దిగువ ప్రాంతమైన బంగారంపేట పంటపొలాలు నీట మునిగాయి. ఇటీవల నాటిన వరి పైరు పూర్తిగా దెబ్బతిని పాచిపట్టిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు.

బస్సు కిందపడి మహిళ మృతి

చిల్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నపువారిపాళెం సమీపంలో బస్సు కిందపడి ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రానికి చెందిన శివానీమహాపుడం(45) అనే మహిళ మూడేళ్లుగా పున్నపువారిపాళెం సమీపంలోని ఓ పరిశ్రమలో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. మంగళవారం పనులకు వెళ్తుండగా పరిశ్రమలో పనిచేసే కూలీలను తీసుకువెళ్లే బస్సు వెనుక నుంచి శివానీమహాపుడంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దర్గాలో 'నిషాన్'

గూడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్ సయ్యద్ హసీం హుస్సేని ఔలియా దర్గాలో బుధవారం సాయంత్రం నిషాన్ జెండా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం దర్గా వెల్ఫేర్ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే జూన్ 2వ తేదీ దర్గా ఆవరణలో గంధం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.







మహానాడులో గూడూరు నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ - మంత్రి నారా లోకేశ్‌తో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహానాడుకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

గూడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొనేందుకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, బెజవాడ రమేష్, మట్టం శ్రావణి, శ్రీదేవి తదితరులు తరలివెళ్లారు.

వెంకటగిరి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో పులికొల్లు రాజజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, గంగాధరం, సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, వెంకటముని, తోటా రామచంద్రయ్య, ఆరికట్ల శ్రీరాములు తదితరులు మహానాడులో పాల్గొనేందుకు కడప బయలుదేరి వెళ్లారు.

నాయుడుపేట: పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మహానాడుకు బయలుదేరి వెళ్లారు.

ఓజిలి: మండలంలోని తెలుగు తమ్ముళ్ల మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కడపలో జరిగే మహానాడుకు తరలివెళ్లారు.

పెళ్లకూరు: మహానాడుకు హాజరయ్యేందుకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, కందమూడి శివకుమార్ ఆధ్వర్యంలో శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కలవకోలు మునీష్, మల్లిఖార్జునరెడ్డి, కేవీ నాయుడు, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, పెంచలయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు తరలివెళ్లారు. అలాగే మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, కృష్ణమనాయుడు, సిద్దులయ్యనాయుడు, మాధవరెడ్డి, నరేంద్రయాదవ్, గురవయ్య, చంద్ర, పరుశురామ్, రవి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

తడ: కడపలో జరుగుతున్న మహానాడులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినితో పాటు పలువురు మంత్రులను నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు.

సూళ్లూరుపేట: మహానాడుకు సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

చిట్టమూరు: మహానాడుకు హాజరయ్యేందుకు చిట్టమూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు గణపర్తి కిషోర్ నాయుడు, శివకోటా రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, మధురెడ్డి, గోపాల్ నాయుడు, సునీల్‌రెడ్డి తదితరులు బయలుదేరి వెళ్లారు.

వాకాడు: మహానాడుకు హాజరయ్యేందుకు వాకాడు మండల టీడీపీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, కల్లూరు హరీష్‌నాయుడు, కోటా శ్రీనివాసులు, బత్తిన ప్రమీల, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, చిరంజీవమ్మ, కలిమి వెంకటేష్, గౌస్ మొహిద్దీన్, సునీత, గంగాధరంరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

కోట: మహానాడుకు హాజరయ్యేందుకు కోట నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, నల్లప్పరెడ్డి వినోద్‌రెడ్డి, మధుయాదవ్, దారా సురేష్, షంషుద్దీన్, తూపిలి రాధకృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, చాపల శ్రీనివాసులు, వాకా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే పాశిం సునీల్ వెంట మహానాడులో ఉన్నారు.







మహానాడుకు వెళ్లేందుకు జెండా ఊపి బయలుదేరుతున్న సూళ్లూరుపేట టీడీపీ నాయకులు - మహానాడులో చిట్టమూరు, పెళ్లకూరు నాయకులు